నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శనివారం 14-11-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:88 పేజీలు:4 వెల: రూ.1/-

క్రాకర్స్ అమ్మకం దారులకు గుడ్ న్యూస్-2గంటలపాటు క్రాకర్స్ కాల్చేందుకు సుప్రీం అనుమతి

తెలంగాణకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ,నవంబర్13(ఆర్ఎన్ఎ): తెలంగాణలో బాణసంచాను నిషేధిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీచేసింది. టపాసుల నిషేధంపై సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవరిస్తూ గ్రీన్ క్రాకర్స్‌కు అనుమతినిచ్చింది. ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. దీపావళి రోజు 2 గంటలపాటు టపాసులు కాల్చుకునేందుకు అవకాశం కల్పించింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు అనుమతి మంజూరు చేసింది. సుప్రీంకోర్టు తీర్పుతో బాణసంచా వ్యాపారులకు ఊరట లభించింది. కాగా కరోనా వైరస్ నేపథ్యంలో క్రాకర్స్‌ను నిషేధిస్తూ హైకోర్టు తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. దీంతో ప్రభుత్వం కూడా నిషేధ ఉత్తర్వులను ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ వ్యాపారులు సుప్రీంకోర్టులో శుక్రవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం రెండు గంటల పాటు గ్రీన్ క్రాకర్స్ కాల్చేందుకు అనుమతినిచ్చింది. ఈ రెండుగంటల్లో కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వెసులబాటు ఉంది. హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలో బాణసంచాపై నిషేధం విధిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో క్రార్స్ అమ్మకం దారులు ఆందోళన చెందారు.

బాణాసంచా అమ్మకాలను నిషేధించడంతో మనస్థాపానికి గురైన దుకాణదారులు సైదాబాద్ ప్రధాన రహదారిపై తమ టపాసులు తామే కాల్చుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. విక్రయదారుల కుటుంబాల్లో కోర్టు ఉత్తర్వులు చీకట్లు నింపిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో బాణసంచా నిషేధించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించిన ఉత్తర్వులను వెంటనే ఎత్తి వేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సుప్రీంను ఆశ్రయించారు. అయితే ప్రభుత్వ ఆదేశాలతో హన్మకొండలో దీపావళి టపాసుల దుకాణాలు వెలవెలబోతున్నాయి. కరోనా మహమ్మారి, హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం బాణసంచాపై నిషేధం విధించడంతో హన్మకొండలోని హయగ్రీవచారి మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు కొనుగోలు దారులు లేక ఖాళీగా దర్శనిమిచ్చాయి. గతంలో 150 దుకాణాలు ఉండగా ఈసారి కరోనా నేపథ్యంలో కేవలం 50 షాపులకే అధికారులు అనుమతి ఇచ్చారు. 50 షాపులున్నప్పటికీ గిరాకీ లేక పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పు చేసి టపాసులను కొనుగోలు చేశామని తీరా విక్రయించే సమయంలో టపాసుల కాల్చడంపై నిషేధం విధించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందే చెబితే తాము టపాసుల దుకాణాలు పెట్టకుండా ఉండేవారమని.. వేలు ఖర్చు పెట్టి సరకు కొనుగోలు చేశామని తీరా అమ్మే సమయంలో ఇలా నిషేధించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేసారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో అధికారులు బాగారెడ్డి స్టేడియంలో బాణసంచా అమ్మకాల దుకాణాలను మున్సిపల్, పోలీసు అధికారులు తనిఖీ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ నెలాఖరు వరకు టపాసుల అమ్మకాల నిలిపివేయాలని సూచిస్తూ దుకాణాలను మూసి వేయించారు. ఈ సందర్భంగా దుకాణంలోని బాణసంచాను ఖాళీ చేయించి వాహనాల్లో తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజారోగ్యం దృష్ట్యా దీపావళి

పండుగ రోజు టపాసులు కాల్చడం మానుకొని అధికార యంత్రాంగానికి సహకరించాలని జహీరాబాద్ ప్రజలను అధికారులు కోరారు. తాజాగా సుప్రీం ఆదేవాలతో ఇక అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు అయ్యింది.

పేద దేశాలకు కూడా వ్యాక్సిన్ అందాలి

ప్రపంచ దేశాలు కలసికట్టుగా ముందుకు సాగాలి

ఫ్రాన్స్ సదస్సులో టెడ్రోస్ అధనోమ్ వెల్లడి

కోళ్ల యాంటీ బాడీలపై పరిశోధిస్తున్న శాస్త్రవేత్తలు

జెనీవా,నవంబర్13(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి తదనంతర పరిణామాలపై పోరాడటానికి అల్ప, మధ్య ఆదాయ దేశాలకు టీకా లభ్యత అత్యవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ అభిప్రాయపడ్డారు. కొవిడ్-19 టీకాకు సంబంధించి పారిస్ పీస్ ఫోరమ్‌లో ఆయన మాట్లాడుతూ..ఆర్థిక పునరుద్ధర ణకు టీకా పంపిణీ జరగాల్సిన అవసరాన్ని వెల్లడించారు. ఇతర వస్తువుల వలే కొవిడ్ టీకా, చికిత్సా విధానాలు, ఇతర వైద్య సౌకర్యాలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరికి సమానంగా, అందుబాటు ధరలో లభించాల్సి ఉందన్నారు. వైద్య సిబ్బంది, వృద్ధులు, ప్రమాదం పొంచి ఇతర వర్గాల ప్రజలకు ఈ సౌలభ్యం ముందుగా అందుబాటులో ఉండాలి. దీనిలో నైతికత, ప్రజారోగ్య అత్యవసరమే కాకుండా ఆర్థికావసరం కూడా ఉందన్నారు. పరస్పరం ఆధారపడ్డ ప్రపంచంలో అల్ప, మధ్య ఆదాయ దేశాలకు టీకా ఆలస్యమైతే, ఆర్థిక పునరుద్ధరణపై ఆ ప్రభావం పడుతుంది. టీకా జాతీయవాదం ఈ మహమ్మారిని మరింత కాలం పొడిగిస్తుంది. ఏ ఒక్క దేశమూ ఒంటరిగా ఈ సవాళ్లను పరిష్కరించలేదంటూ సంపన్న దేశాలను దృష్టిలో పెట్టుకొని హెచ్చరించారు. కొవిడ్ 19 మహమ్మారిని ఎదుర్కోవడానికి అవసరమైన పరికరాలు, సామగ్రిని సమానంగా పంపిణీ చేయడానికి ఆరోగ్య సంస్థ, యూరోపియన్ కమిషన్, ఫ్రాన్స్, బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ యాక్సెస్ టు కొవిడ్-19 టూల్ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. అయితే, నిధుల కొరత వల్ల ఈ కార్యక్రమానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా కరోనా వ్యాక్సిన్ కోసం సైంటిస్టులు నిర్విరామంగా పరిశోధనలు చేస్తున్నారు. ఈ పరిశోధనల్లో పలు దేశాలకు చెందిన సైంటిస్టులు కరోనా వ్యాక్సిన్ కోసం చేస్తున్న శ్రమవృథా అవుతున్నట్లు తెలుస్తోంది. వ్యాక్సిన్ పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రావాలంటే తప్పని సరిగా మూడు దశల్లో హ్యూమన్ ట్రయల్స్ నిర్వహించాలి. ఈ ట్రయల్స్ ఫెయిలవుతున్నట్లు తెలుస్తోంది. అయినా సరే టీకాతోపాటు మాత్రలు, నాజల్ డ్రాప్స్‌ను తయారు చేసేందుకు ప్రయోగాలు చేస్తున్నారు. ఈ ప్రయోగాల్లో కోడి నుంచి యాంటీబాడీస్ తీసుకుని కరోనా తీవ్రతను తగ్గించవచ్చని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ సైంటిస్ట్ లు నిర్ధారించారు. ఎలుకలు, పందులతో మనుషులకు చాలా పోలికలు ఉన్నట్టే కోళ్లతోనూ మనుషులకు చాలా దగ్గరి పోలికలు ఉంటాయి. మనుషుల్లో మాదిరే కోళ్లలోనూ యాంటీబాడీలు ఉత్పత్తి అవుతాయి. కోడిగుడ్లలోని యాంటీబాడీలు కరోనా నుంచి కొంత కాలం రక్షణ కల్పిస్తాయని స్టాన్‌ఫర్డ్ సైంటిస్ట్ డేరియా మూచీ రోజెన్ తెలిపారు. ప్రస్తుతం కరోనా నిరోధక నాజల్ స్ప్రేను 48 మంది పేషంట్లపై ప్రయోగాలు నిర్వహిస్తున్నామని, పూర్తి ఫలితాలు వచ్చాక మరిన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు.

ప్రజలకు సిఎం కెసిఆర్ దీపావళి శుభాకాంక్షలు

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ ఇంటి లోగిలి కార్తీక దీపకాంతులతో వెలుగులీనాలని, అన్నదాత కళ్లల్లో ఆనందపు కాంతులు వెల్లివిరియాలని కేసీఆర్ ఆకాంక్షించారు. అజ్ఞానాంధకారాలు తొలగించి విజ్ఞానపు వెలుగును దీపావళి ప్రసాదించాలి అని సీఎం అన్నారు.

కాళోజి చిరస్మరణీయ ప్రజాకవి

నివాళి అర్పించిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): ప్రజాకవి కాళోజీ నారాయణరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ సేవలను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. జీవితాంతం ప్రజల గొంతుకగా బతికిన కాళోజి నారాయణ రావు ఎప్పటికీ స్మరణీయుడే అని సీఎం అన్నారు. తన మాట, సాహిత్యం ద్వారా తెలంగాణ సమాజాన్ని నిత్యం చైతన్య పరిచిన వైతాళికుడు కాళోజి అని కేసీఆర్ కొనియాడారు. ఇదిలావుంటే నిరంతరం తెలంగాణ కోసం పరితపించిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. విలువలు చాటిన మహనీయుడిగా ప్రఖ్యాతి పొందారని అన్నారు. కాళోజీ నారాయణరావు వర్ధంతి సందర&ధంగా ఆయనకు నివాళు లర్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మానవతే కేంద్రంగా కవిత్వాన్ని రాసి ప్రపంచ వ్యాప్తం చేసిన వ్యక్తి కాళోజీ అని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టమని చెప్పారు. కాళోజీ ఆశీస్సులతో సీఎం కేసీఆర్ ఆచరణతో సాంస్కృతిక తెలంగాణగా మారుతుందన్నారు. సాంస్కృతిక పునరుజ్జీవనం , మొత్తం తెలంగాణ అభివృద్ధిగా మారుతుందని ఆకాంక్షించారు. కాళోజీ జీవితమే ఆదర్శంగా తీసుకుని తెలంగాణలో అనేక మంది కవులుగా ప్రసిద్ధి పొందారని అన్నారు.

కరోనా తీవ్రత తగ్గుతున్నా..జాగ్రత్తలు పడాల్సిందే

పండగల వేళ మరింత అప్రమత్తత అవసరం

షాపింగ్‌ల పేరుతో విచ్చలవిడిగా తిరగొద్దు

మాస్కులు దరించడం మరవొద్దు

చలి తీవ్రత..బాణాసంచాతో శ్వాసకోస వ్యాధులు

హెచ్చరించిన వైద్యారోగ్య శాఖ సంచాలకులు శ్రీనివాస్

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): కోవిడ్ తీవ్రత మరింత తగ్గిందని కోఠి కమాండ్ సెంటర్ డీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. అయితే ప్రజలు పండగల వేళ మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. దీపావళితో పాటు చలి కూడా పెరిగిందని... చలి పెరిగితే వైరస్ ప్రభలే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీలో వాయు కాలుష్యం, చలి వల్లే వైరస్ కేసేలు పెరగడంతో పాటు, మరణాలు సంభవిస్తున్నాయని అక్కడి వైద్యులు చెబుతున్నారని ఆయన తెలిపారు .శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రజలు తీసుకుంటున్న జాగ్రత్తలు కేసుల తగ్గుదలకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. 1200 రాపిడ్, 310 మొబైల్ టెస్టింగ్ సెంటర్స్ ద్వారా టెస్టులు చేస్తున్నట్లు చెప్పారు. తామే ప్రజల దగ్గరకు వెళ్లి టెస్టులు మొబైల్ వ్యాన్స్‌తో చేస్తున్నట్లు వెల్లడించారు. దీపావళి సందర్భంగా బాణాసంచాలను బ్యాన్ చేశారని.. అయితే వ్యాపారులకు ఇది ఇబ్బందికర సమస్య కానీ ప్రజల ప్రాణాలు అంతకన్నా ముఖ్యమని స్పష్టం చేశారు. ఏటా దీపావళి తరువాత శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయన్నారు. కోవిడ్ నేపథ్యంలో ప్రజలు ఫైర్ క్రాకర్స్ లేకుండా ఈ ఏడాది దీపావళి జరుపుకోవాలని కోరారు. పెళ్లిళ్లలోను బాణసంచా కాల్చవద్దన్నారు. పండుగల సమయంలో షాపింగ్స్‌కు ఎక్కువగా వెళ్తున్నారని ఆయా సమయాల్లో తప్పక కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు. మాట్లాడేప్పుడు మాస్క్‌ని తీసివేయడం సరికాదన్నారు. మాస్క్‌ను గడ్డం కిందకి వేసుకోవడం సరికాదని ఆయన చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న ఏ వాక్సిన్ కూడా ఏడాది కాలంలో అందుబాటులోకి రాలేదని.... చాలా ఏళ్ళ పరిశోధనలు జరగాల్సి ఉంటుందని తెలిపారు. కోవిడ్ కారణంగా వ్యాక్సిన్‌ను అతి తక్కువ కాలంలో వచ్చేలా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారన్నారు. ప్రజలు వ్యాక్సిన్ కోసం ఎదురు చూడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీనివాస్ సూచనలు చేశారు. ప్రజలు తీసుకుంటున్న జాగ్రత్తల వల్ల కొవిడ్ కేసులు చాలావరకు తగ్గాయన్నారు. చలి పెరిగితే కరోనా వైరస్ ప్రబలే అవకాశం ఉందన్నారు. దీపావళి తర్వాత శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయన్నారు. బాణసంచాకు దూరంగా ఉండాలని సూచించారు. దీపావళి, శుభకార్యాల కోసం షాపింగ్ చేస్తున్న నేపథ్యంలో జనం రద్దీ ఉన్న చోట తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముక్కు, నోరును పూర్తిగా కప్పి ఉంచేలా మాస్కు ధరించాలన్నారు. ప్రజలు వ్యాక్సిన్ కోసం ఎదురుచూడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల సంఘం తప్పిందం వల్లే ఓడిపోయాం..

-బిహార్ ఫలితాలపై తేజస్వీ యాదవ్ సంచలన వ్యాఖ్యలు

పాట్నా,నవంబర్13(ఆర్ఎన్ఎ): బిహార్ ఎన్నికల ఫలితాలపై మహాకూటమి సీఎం అభ్యర్థి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బిహార్ ఎన్నికల్లో ప్రజలు మహాకూటమికి అనుకూలంగా తీర్పు ఇస్తే.. ఎన్నికల సంఘం మాత్రం ఎన్డీయేకు అనుకూలంగా ఫలితాలు విడుదల చేసిందని ఆరోపణలు చేశారు. అయితే... ఇలాంటి తప్పు ఇదేం మొదటి సారి కాదని పేర్కొన్నాడు తేజస్వీ యాదవ్. 2015 ఎన్నికల్లోనూ ఇలాగే ఎన్నికల సంఘం ఎన్డీయేకు అనుకూలంగా పలితాలు ఇచ్చిందని మండిపడ్డారు. ప్రజలు భారీ మెజారిటీతో మహాకూటమికి పట్టం కట్టారని...కానీ అధికారం కోసం బీజేపీ దొడ్డిదారులు వెతుక్కుందని ఆరోపించారు. కాగా.. ఎన్డీఏకే పట్టం కట్టారు బీహార్ ప్రజలు. మరోసారి సుశాసన్ బాబు నితీష్.. సీఎంగా ఎన్నిక కానున్నారు. అయితే ఈ సారి ఎన్నికల్లో ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్.. తన సత్తా చాటారు. చివరివరకూ ఎన్డీఏకు గట్టిపోటీ ఇచ్చారు. ఎల్జేపీ పెద్దగా సీట్లు సాధించకున్నా.. గణనీయంగా ఓట్లు చీల్చింది. మొత్తం 243 స్థానాలకుజరిగిన ఎన్నికల్లో మేజిక్ ఫిగర్ సాధించింది. 125 స్థానాలు గెల్చి ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇక ఆర్జేడీ ఆధ్వర్యంలోని మహాఘట్ బంధన్ 110 స్థానాలు సాధించింది.

పంచాయితీరాజ్ వ్యవస్థలో మార్పులు

-మంత్రితో మండల పరిషత్ అభివృద్ధి అధికారుల భేటీ

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): గ్రామ పంచాయతీ వ్యవస్థలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పంచాయితీలను బలోపేతం చేసే దిశగా అనేక కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. పల్లె ప్రగతిని విజయవంతం చేయడంలో, పల్లెల పరిశుభ్రత విషయంలో ఎంపీడీఓల పాత్ర మరువలేనిదని అన్నారు. అతి త్వరలో ఇంకా కొంత మంది పర్యవేక్షణ అధికారులు వస్తారని తద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా గౌరవ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచిస్తున్నారని తెలిపారు. నూతనంగా ఎంపికైన తెలంగాణా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల రాష్ట్ర సంఘం నాయకులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుని బంజారాహిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఎంపీడీవో ల సంఘం నూతన కార్యవర్గం, అధ్యక్షుడు ఎం సత్తయ్య, కార్యదర్శి ప్రశాంతి, కార్యవర్గ సభ్యులు నరేందర్ రెడ్డి, శేఖర్, శంకర్ నాయక్, వెంకటపతిరాజు, క్రాంతి ఉమాదేవి, రమేష్ తదితరులు మంత్రిని కలిశారు.

ఈమేరకు ఆయన వారిని అభినందించారు. కాగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ను ఏకీకృతం చేయాల్సిన అవసరం ఉందని ఎంపీడీవోలు విన్నవించారు. అదేవిధంగా ఎంపీడీవో లకు సంబంధించి ప్రమోషన్ల అవకాశాలు మరింత పెంచవలసిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తో మాట్లాడి ఈ విషయం చర్చిస్తామని మంత్రి అన్నారు. ఎంపీడీఓలు క్షేత్ర స్థాయిలో బాగా పని చేస్తూ ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింప చేయాలన్నారు.

పనిచేసే ప్రభుత్వాన్నే ఆదరించండి

నగరంలో విస్తృతంగా పర్యటించిన కెటిఆర్

అర్హులందరికి త్వరలోనే డబుల్ ఇళ్లు అందచేస్తాం

పలు ప్రారంభోత్సవాలతో ప్రజల ముందుకు మంత్రి

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరాభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టామని అన్నారు. ఆలస్యమైనా అందరికీ డబుల్ ఇళ్లను అందచేస్తామన్నారు. శుక్రవారం ఉదయం సనత్‌నగర్ నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులతోపాటు నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలను ప్రారంభించారు.తెలంగాణను భారతదేశంలోనే అగ్రశ్రేణి రాష్ట్రంగా నిలపాలనే ఉద్దేశంతో సీఎం పని చేస్తున్నారు. రాష్ట్రం రెవెన్యూను పెంచాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఉద్ఘాటించారు. పేదలకు సంక్షేమ కార్యక్రమాల రూపంలో ఆ ఆదాయాన్ని అందించాలన్నదే సీఎం ఉద్దేశం అని కేటీఆర్ తెలిపారు. పేదలకు, మధ్యతరగతి వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. కరోనా వైరస్, వరదల సమయంలో ప్రజలను ఆదుకున్నామని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు తప్పకుండా డబుల్ బెడ్ రూం ఇండ్లను పంపిణీ చేస్తామన్నారు. పేదవారికి స్థలాలు ఉండి పట్టాలు రాని వారు ఉన్నారు. గతంలో జీవో నం. 58, 59 కింద కొంతమందికి ఇచ్చాం. మిగతా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ఉదయం 10 గం.లకు సనత్‌నగర్‌లోని బల్కంపేట్‌లో రూ. 3.60కోట్లతో నిర్మించిన వైకుంఠధామాన్ని కేటీఆర్ ప్రారంభించారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ సమీపంలో 2.45 ఎకరాల విస్తీర్ణంలో వైకుంఠధామం నిర్మించారు. శ్మశానవాటిక ప్రవేశమార్గాన్ని జీహెచ్ఎంసీ ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం సనత్ నగర్ నియోజకవర్గం నుంచే చేపట్టాం. ఆదర్శవంతంగా ఇండ్లను నిర్మించాం. సనత్‌నగర్‌లో వైకుంఠధామం, స్పోర్ట్స్ కాంప్లెక్స్, లింక్ రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలని సీఎం కేసీఆర్ చెప్పారు. ఆ విధంగా సనత్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. హైదరా బాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేస్తున్నాం. కరెంట్ సమస్య లేదు. తాగునీటి కష్టాలు లేవు. రోడ్లను అభివృద్ధి చేసుకుంటున్నాం. హైదరాబాద్‌లో సనత్ నగర్ నియోజకవర్గం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. వర్యటనలో భాగంగా మారేడ్‌పల్లిలో రూ. 3 కోట్లతో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. అంతకంటే ముందు ఆదయ్యనగర్‌లో రూ. 3 కోట్లతో నిర్మించిన అధునాతన లైబ్రరీని ప్రారంభించారు. సనత్ నగర్ నియోజక వర్గంలో రూ. 5కోట్లతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు కూడా మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు బ్యాడ్మింటన్ కోర్టులు, లేడీస్ జిమ్, యోగా హాల్, స్నూకర్ రూమ్, క్యారమ్స్, జెంట్స్ జిమ్, టేబుల్ టెన్నిస్ ఆడుకునేందుకు నడుపాయాలను కల్పించారు. సనత్ నగర్ నెహ్రూ పార్కులో థీమ్

పార్క్ నిర్మాణానికి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అంతకు ముందు బల్కంపేటలో రూ. 3.60 కోట్లతో నిర్మించిన వైకుంఠధామాన్ని ప్రారంభించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. ప్రజల కష్టాలు, అవసరాలు తెలుసుకుని వాటిని తీర్చే వారే అసలైన నాయకులు అని కేటీఆర్ అన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సనత్ నగర్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకు పోతోంది అని స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడ్డ సమయంలో అనేక అనుమానాలు ఉండేవి. అప్పుడు కరెంట్ ఉంటే వార్త.. నాడు నీళు వస్తే వార్త. అప్పుడు సుస్తీ ఎక్కడికి పోవాలో తెలియని పరిస్థితి. కానీ తెలంగాణ ప్రభుత్వంలో అలాంటి సమస్యలు లేవు. 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను ఇస్తున్నాం

. ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తున్నాం. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసుకున్నాం.. ఇలా హైదరాబాద్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మంత్రి వెంట తలసాని, మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

సనత్ నగర్ డివిజన్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన మంత్రి కెటిఆర్. చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తదితరులు ఉన్నారు.

బైడెన్‌కు కంగ్రాట్స్ చెప్పిన చైనా..

హైదరాబాద్:, నవంబర్ 13 తాజాగా జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఆయన ఎన్నికైన వారం రోజుల తర్వాత డ్రాగన్ దేశం చైనా.. బైడెన్‌కు శుభాకాంక్షల సందేశాన్ని వినిపించింది. ఇటీవల అమెరికా, చైనా మధ్య సంబంధాలు బలహీనపడ్డాయి. అధ్యక్షుడు ట్రంప్ వైఖరి వల్ల ఆ రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. బైడెన్ ఎన్నికపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ వెన్‌బిన్ ఇవాళ స్పందించారు. అమెరికా ప్రజల నిర్ణయాన్ని గౌరవిస్తామని, బైడెన్, కమలా హ్యారిస్‌లకు కంగ్రాట్స్ చెబుతున్నట్లు వాంగ్ వెన్‌బిన్ తెలిపారు. అమెరికా ఎన్నికల ఫలితాలు.. ఆ దేశ ఎన్నికల చట్టాలకు లోబడే ఉంటాయని భావిస్తున్నట్లు చైనా అధికారి తెలిపారు. అమెరికా, చైనా మధ్య గత కొన్నాళ్ల నుంచి వాణిజ్య యుద్ధం నడుస్తోంది. కోవిడ్ మహమ్మారికి చైనానే కారణమంటూ ట్రంప్ ఆరోపించారు. హాంగ్ కాంగ్‌లో మానవ హక్కుల ఉల్లంఘనకు కూడా చైనానే కారణమని ఆరోపణలు ఉన్నాయి. చైనాతో ప్రపంచ దేశాలకు ప్రమాదం ఉందని కూడా ట్రంప్ హెచ్చరించారు.

విఘ్నేష్ కుటుంబానికి 5లక్షల సాయం అందచేత

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్13(ఆర్ఎన్ఎ): పెద్దపులి దాడిలో మృతి చెందిన దహెగాం మండలం దిగిడ గ్రామానికి చెందిన విగ్నేష్ కుటుంబానికి శుక్రవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఐదు లక్షల రూపాయల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు. వారి కుటుంబంలో ఒకరికి అటవీ శాఖలో ఉద్యోగం కల్పిస్తామని,ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

చరిత్రలో నేటినిజం

కం॥ దీపావళి శుభ దినమున
పాపావళి రూపు మాపి-పశమాత్ముడవ
ట్రాపవళి వలుశుభములనిడి
కాపాడును జనులనెల్ల కరుణాహృదయుడై!!

(నవంబర్ 14 దీపావళి పర్వదినం....)

-రాధశ్రీ

సెల్: 9494481210

దీపాల వెలుగుల పరమార్థం తెలుసుకోవాలి

నేటినిజం
శనివారం 14-11-2020

దీపావళి అంటే దీపముల వరుస. చీకటి నుంచి వెలుగులోకి రావడం అనేది అంతరార్థం. మనచుట్టూ ఆవరించిన అంధకారం దీపం వెలిగించగానే మాయమైనట్లు అనేక జన్మలలో చేసిన పాపాలు భగవంతుని కరుణాకటాక్షాలతో దూరం అవ్వడమే దీపావళి. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాస ప్రారంభంలో దేవీ నవరాత్రులు, నరక చతుర్దశి, దీపావళి పండుగలు రావడం విశేషం. త్రయోదశి రోజు రాత్రి అపమృత్యు నివారణ కోసం దీపాలు వెలిగించి ఇంటిముందు ఉంచాలి. నరక చతుర్దశి రోజున అభ్యంగన స్నానం చేయాలి. నరకం వలన భయం లేకుండా నరక చతుర్దశి నాడు స్నానం చెయ్యాలని నరక చతుర్దశి గురించి యమధర్మరాజుని ఉద్దేశించి చెప్పినట్లు భవిష్య పురాణం చెబుతోంది. శ్రీరాముడు ఆశ్వయుజ మాసంలో విజయదశమి రోజున శమీ వృక్షాన్ని పూజించి అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడయ్యాడు. మహావిష్ణువు వామనావతారం ఎత్తి బలిచక్రవర్తిని పాతాళ లోకానికి పంపించాడు. అయినప్పటికీ బలి శ్రీహరినే ధ్యానిం చాడు. దానికి సంతోషించిన శ్రీహరి 'నీవు దీపావళి రోజున పాతాళ లోకం నుంచి భూలోకానికి వచ్చి ఈ ఒక్కరోజు పరిపాలన చెయ్యి' అన్నాడు. ఆ రోజు వెలిగించే దీపాలకే బలిదీపం అని పేరు. వరావతారంలో విష్ణుమూర్తికి, భూదేవికి జన్మించినవాడే నరకాసురుడు. బ్రహ్మ వల్ల వరాలు పొంది దేవతల్ని బాధపెట్టాడు. దేవతలందరూ దేవేంద్రుని వద్దకు వెళ్లి తమ బాధ చెప్పుకోగా దేవేంద్రుడు దేవతలందరితో కలిసి విష్ణు మూర్తి వద్దకు వెళ్లి ప్రార్థించగా శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి నరకుడిని వధించారు. భూదేవి కూడా నరకుడి మరణానికి బాధపడలేదు. ఆమె అతనొక్కడికే తల్లి కాదు, భూమి మీద జీవించే ప్రతివారికి తల్లే కదా. పుత్ర శోకాన్ని మరచి నరకుని పేరు మీద పండుగగా ప్రజలు జరుపుకోవాలని శ్రీమహావిష్ణువుని ప్రార్థించింది. అదే నరక చతుర్దశి. ఆ తర్వాత రోజే ఆనందోత్సాహాలతో జరుపుకునే దీపావళి పండుగ. ప్రతి ఇంటా దీపాల వెలుగులు నింపే పండుగ దీపావళి. చీకటిపై వెలుగు, చెడుపైన మంచి, అజ్ఞానం మీద జ్ఞానం సాధించిన గెలుపునకు ప్రతీక ఈ పండుగ. దీపావళి పండుగ అంటే ప్రముఖంగా గుర్తొచ్చేవి పట్టుబట్టలు, పిండివంటలు, బాణాసంచా, దీపాల కాంతులు. దేశ ప్రజలు తమదైన శైలిలో పండుగను ఒక్కో చోట ఒక్కో విధంగా చేసుకుంటారు. ఉత్తర, దక్షిణ భారత ప్రజలు తమదైన సంప్రదాయాలతో, భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు. అయితే ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో పండుగ జరుపుకునే పద్ధతులలే కాదు అందుకు గల కారణాలు కూడా వేరు. పండుగ ఎందుకు జరుపుకుంటున్నారనే దానిపై ఒక్కో ప్రాంతంలో ఒక్కో కథ ప్రచారంలో ఉంది. శ్రీ మహావిష్ణువు వరాహ అవతారంలో ఉండగా వరాహస్వామి, భూదేవిలకు అసుర సంధ్యా సమయంలో నరకుడు జన్మిస్తాడు. తప్పస్సుతో శివుడి చేత వరం పొంది దేవమానవులను చిత్రహింసలకు గురి చేస్తుంటాడు. నరకాసురుడు తల్లి చేతుల్లోనే చంప బడాలనే వరం పొందిన కారణంగా ఎదురులేని వాడై లోకాలను ముప్పతిప్పలు పెడుతుంటాడు. దీంతో భయాందోళనకు గురైన దేవతలు శ్రీ మహావిష్ణువుని శరణువేడుతారు. వారికి అభయమిచ్చిన విష్ణువు భూదేవీ సమేతంగా శ్రీ కృష్ణ సత్యభామలు గా భూలోకంలో జన్మిస్తారు. నరకుని దురాగతాలు పెచ్చుమీరిన అనంతరం శ్రీకృష్ణుడు నరకుడిపై యుద్ధం ప్రకటిస్తాడు. భార్య సత్యభామను వెంటతీసుకెళతాడు. అక్కడి ఇరు వర్గాలకు భీకర యుద్ధం జరుగుతుంది. చివరకు నరకుడి వరం కారణంగా తల్లి అయిన సత్యభామ చేతిలోనే మరణిస్తాడు. దీంతో అతడి చెరలో ఉన్న దేవమానవులకు విముక్తి దొరకుతుంది. నరకాసురుడు మరణించాడన్న ఆనందంలో ప్రజలు దీపాలు వెలిగించి, బాణాసంచా పేల్చి పండుగ చేసుకున్నారు. శ్రీ మహావిష్ణువు ఏడవ అవతారమైన రామచంద్రుడు.. సీతను అపహరించిన రావణుడితో భీకర యుద్ధం చేస్తాడు. ఈ యుద్ధంలో రావణుడు మరణిస్తాడు. అప్పటికే రాముడి 14 ఏళ్ల వనవాసం ముగుస్తుంది. దీంతో రాముడు.. సీత,లక్ష్మణ,ఆంజనేయ సమేతంగా అయోధ్యకు తిరిగి వెళతాడు. అనంతరం రాముడు పట్టాభిషిక్తుడవుతాడు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఆనందంతో పండుగ జరుపుకున్నారు. గదిని ఆవరించిన అంధకారం దీపం వెలిగించగానే మాయమైనట్లు అనేక జన్మలలో చేసిన పాపాలు భగవంతుని కరుణాకటాక్షాలతో దూరం అవ్వడమే దీపావళ అని పెద్దల ఉవాచ. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాస ప్రారంభంలో దేవీ నవరాత్రులు, నరక చతుర్దశి, దీపావళి పండుగలు రావడం విశేషం. త్రయోదశి రోజు రాత్రి అపమృత్యు నివారణ కోసం దీపాలు వెలిగించి ఇంటిముందు ఉంచాలి. నరక చతుర్దశి రోజున అభ్యంగన స్నానం చేయాలి. నరకం వలన భయం లేకుండా నరక చతుర్దశి నాడు స్నానం చెయ్యాలని నరక చతుర్దశి గురించి యమధర్మరాజుని ఉద్దేశించి చెప్పినట్లు భవిష్య పురాణం చెబుతోంది. దీపావళి అంటే దీపముల వరుస. చీకటి నుంచి వెలుగులోకి రావడం అనేది అంతరార్థం. అమావాస్య కనుక ప్రపంచమంతా చీకట్లు ఆవరించి ఉంటాయి. ఈ చీకట్లను పాదోలేందుకు దీపాలు వెలిగించాలన్న ఆలోచనతోనే దీపావళి జరుపుతారు. దీపాల వెలుగుల కారణంగా చీడపీడలు, పురుగూ పుట్రా, అడవి జంతువుల భయం ఉండదన్న భావన కూడా ఉంది. నరకాసురుడు మరణించిన రోజుగా నరకచతుర్దశినీ, దీపావళినీ వేడుక చేసుకుంటాం. ఈ పండుగ నుంచి మనం గ్రహించాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి. ఈ పండుగను నరకాసుర వధకు సంకేతంగా కాదు, మన లోపల ఉన్న దోషాలను తొలగించుకోవడానికి ఒక సంకల్పంగా జరుపుకోవాలి. అప్పుడే అది నిజమైన దీపావళి అవుతుంది. లేకపోతే డబ్బు ఖర్చూ, నూనె ఖర్చూ, టపాకాయల ఖర్చూ తప్ప ప్రయోజనం ఉండదు.

విద్యావ్యవస్థ సంస్కరణలకు మూలపురుషుడు మౌలానా అజాద్

మచిలీపట్నం,నవంబర్ 13 (ఆర్ఎన్ఎ): మంత్రి పేర్ని నాని భారతదేశపు తొలి విద్యాశాఖామంత్రిగా విద్యలో అనేక సంస్కరణలను తీసుకువచ్చిన గొప్ప మానవతవాది, రచయత, బహు భాషా కోవిదులు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాదేనని రాష్ట్ర రవాణా, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) పేర్కొన్నారు. గురువారం బుడ్డా సాహెబ్ ఛారిటబుల్ ట్రస్ట్ కైకలూరు ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో భాగంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్ర పుస్తకాన్ని మంత్రి పేర్ని నాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అబుల్ కలాం విద్య రంగానికి చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలో అనేక పథకాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని అన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల మౌలిక వసతులను మెరుగుపరచడం, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు, ఇతర సౌకర్యాలతో పాటు అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలను అమలు చేస్తూ విద్యకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు కృషి చేయడమే కాక ఎన్నో విప్లవాత్మక విద్యా సంస్కరణలను అమలుపరిచేందుకు మౌలానా అబుల్ కలాం ఆజాదే అంకిత భావంతో పనిచేశారన్నారు . చిన్నపిల్లల్లో ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడాన్ని ప్రోత్సహించారు. పాఠశాలలు, కళాశాలల నిర్మా?ణానికి జాతీయ కార్యక్రమాన్ని ప్రణాళికను రూపొందించి 14 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించే ఆలోచనను ఆయనే ముందుకు తెచ్చారని మంత్రి పేర్ని నాని వివరించారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బుడ్డా సాహెబ్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాలిబ్ బాబు , 15 వ వార్డు ఇంచార్జ్ మహమ్మద్ రఫీ , అనీస్, రెహమాన్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో ఒకేరోజు రికార్డు స్థాయిలో కరోనా కేసులు

న్యూయార్క్,నవంబర్13(ఆర్ఎన్ఎ): అమెరికాను కరోనా మహమ్మారి వణికిస్తూనే ఉంది. జాన్స్ హాప్కిన్స్ లెక్కల ప్రకారం బుధవారం ఒక్కరోజే అమెరికా వ్యాప్తంగా 1,36,325 కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనా మహమ్మారి దేశంలోకి ప్రవేశించిన నాటి నుంచి ఒకేరోజు ఇన్ని కేసులు నమోదుకావడం ఇదే మొదటిసారి అని తెలుస్తోంది. కొత్తగా నమోదైన కేసులతో అమెరికాలో మొత్తం కేసుల సంఖ్య 1,07,08,728కు చేరుకుంది. మరోపక్క అమెరికాలో కరోనా బారిన పడి ఇప్పటివరకు 2,47,398 మంది మత్యువాతపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక కరోనా కేసులు, మరణాలు అమెరికాలోనే నమోదైన విషయం తెలిసిందే. శీతాకాలం సమీపించడంతో అమెరికాలో కరోనా మూడో వేవ్ మొదలైంది.

దేశంలో పరిస్థితి ఈ విధంగా ఉన్నప్పటికి అధ్యక్షుడు ట్రంప్ కరోనాకు సంబంధించి ఒక్క అధికారిక ప్రకటన కూడా చేయడం లేదు. నవంబర్ మూడో తేదీన జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి చెందడంతో.. అప్పటి నుంచి ఆయన అధికారికంగా ఒక్క కార్యక్రమంలో కూడా పాలుపంచుకోలేదు. బుధవారం వెటరన్స్ డే సందర్భంగా ఆయన మొదటిసారి వైట్ హౌస్ నుంచి బయటకు వచ్చి అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదిలా ఉంటే.. అధ్యక్షుడిగా ఎన్నికైన జో బైడెన్ ఇప్పటికే కొవిడ్1÷-ఖ9 టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్ కరోనాను ఏ విధంగా నియంత్రించాలన్న దానిపై పనిచేస్తుంది. గతంలో ఎబోలా వంటి వైరస్‌ల నుంచి దేశాన్ని కాపాడిన అనేక మంది నిపుణులు ఈ టాస్క్‌ఫోర్స్‌లో భాగమయ్యారు.

33 ప్రైవేటు ఆసుపత్రుల్లో కోవిడ్ రోగులకు అవకాశం

80 శాతం రిజర్వేషన్‌కు ఢిల్లీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ,నవంబర్13(ఆర్ఎన్ఎ): దేశ రాజధానిలోని 33 ప్రైవేటు ఆసుపత్రుల్లో కోవిడ్ రోగుల కోసం 80 శాతం ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లోని బెడ్లను కేటాయించేందుకు ఢిల్లీ ప్రభుత్వానికి అనుమతి ఇస్తున్నట్లు ఢిల్లీ హైకోర్టు ప్రకటించింది. ఇంతకు ముందు ఇదే విషయంపై వ్యాజ్యం దాఖలు కాగా సింగిల్ జడ్జ్ బెంచ్ స్టే విధించింది. కాగా, ఈ స్టేపై గురువారం తీర్పు వెలువడింది. ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రైవేటు ఆసుపత్రుల్లోని ఐసీయూల్లో కోవిడ్1÷-ఖ9 రోగులకు ప్రత్యేక రిజర్వేషన్ సదుపాయం కల్పించాల్సిందేనని తేల్చి చెప్పింది. సెప్టెంబర్ 12న ఢిల్లీలోని 33 ప్రైవేటు ఆసుపత్రుల్లో కోవిడ్ రోగుల కోసం 80 శాతం ఐసీయూ బెడ్లను కేటాయించాలని ఢిల్లీ ప్రభుత్వం తీర్మానించింది. కాగా దీనిపై సెప్టెంబర్ 22న ఢిల్లీ హైకోర్టులోని సింగిల్ జడ్జి బెంచ్ స్టే విధించింది. అనంతరం అక్టోబర్ 9న డివిజనల్ బెంచ్ అప్పీళును స్వీకరించి విచారణకు తీసుకుంది. మళ్లీ దీనిని నవంబర్ 27కు వాయిదా వేసింది. అనంతరం ఢిల్లీ ప్రభుత్వం అపెక్స్ కోర్టును ఆశ్రయించింది.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసిన మంత్రి

మేడ్చల్ మల్కాజిగిరి, నవంబర్ 13: దేశంలో ఎక్కడ లేని విధంగా పేదల కోసం సంక్షేమం పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సదర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని పేర్కొన్నారు.

పేదింట్లో పెండ్లిళ్లు చేయడానికే ఇబ్బంది పడే కుటుంబాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు భరోసాను నింపాయన్నారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ నేతి మంగమ్మలతో టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు మేకల అయ్యప్ప, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో 'బాల'భారతం..!

(14 నవంబర్ "జాతీయ బాలల దినోత్సవం" సందర్భంగా)

భారతదేశంలో గత రెండు దశాబ్దాలుగా పేదరికం 21 శాతం తగ్గడం, శిశు మరణాలు సగానికి పైగా తగ్గడం, 80 శాతానికి పైగా గర్భిణులు ఆసుపత్రుల్లో ప్రసవించడం మరియు 2 మిలియన్ల పిల్లలు బడులకు దూరమైపోవడం వంటి విభిన్న వాస్తవాలు బయట పడ్డాయి. దీనికి తోడుగా నేడు కోవిడ్-19 కల్లోలం కారణంగా ఉద్భవించిన సామాజిక ఆర్థిక ప్రభావంతో అదనంగా 6.7 మిలియన్ల 5 సంవత్సరాల లోపు వయస్సుగల బాలలు ప్రమాదకర పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, సగానికి పైగా బాలల మరణాలు నమోదు అవుతున్నాయని 'యూనిసెఫ్-2020 నివేదిక' కఠిన వాస్తవాలను వెళ్లడించడం విచారకరం. ప్రతి ముగ్గుకు బాలల్లో ఒక్కరు తీవ్ర పోషకాహారలోపంతో బాధ పడుతున్నారు. పోషకాహారలోపంతో బాధపడుతున్న బాలలకు కరోనా లాంటి అనేక అంటువ్యాధులు తొందరగా సోకుతాయని తెలుపుతున్నారు. కడుపేదరికం, పని దొరక్క పోవడం మరియు ఆహార అభద్రత కారణాలు బాలల ఆరోగ్యంపై విష ప్రభావాన్ని చూపిస్తున్నాయి. అత్యవసర పోషకాహార సరఫరా దెబ్బతిని, ధరలు పెరగడంతో బాలలు కనీస పోషకాహారానికి దూరం అవుతూ, తీవ్ర పోషకాహారలోప స్థితితో 38.4 శాతం బాలల శారీరక అభివృద్ధి ఆగిపోయిన కారణంగా వయస్సు కన్న అతి తక్కువ ఎత్తుతో (స్టంటింగ్) పొట్టి వాళ్ళలా మారుతున్నారని కూడా గుర్తించారు.

మన దేశంలో మగ శిశువుల కన్న ఆడ శిశు మరణాలు ఎక్కువగా నమోదు కావడం బాధాకరం. దీని కారణంగా మగ ఆడ పిల్లల నిష్పత్తి 1000:900 ఉండడం ప్రకృతి విరుద్ధమని తెలుసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా 5 ఏండ్ల లోపు మగ బాలలు 7 శాతం మరణిస్తే, మన ఇండియాలో 11 శాతం ఆడ బిడ్డలు మరణిస్తున్నారు. గ్రామీణ, పట్టణ మురికివాడలు, యస్సి, యస్టి, పేదకుటుంబాలకు చెందిన పిల్లల్లో పోషకాహారలోపం, ఆరోగ్యవసతుల లేమి, బాల్యవివాహాలు, పాఠశాలలకు పిల్లలు దూరమవడం, పరిసరాల మరియు వ్యక్తిగత అపరిశుభ్రత, సురక్షిత త్రాగునీరు లేకపోవడం లాంటి సమస్యలు చుట్టు ముట్టుతున్నాయి. దేశ కౌమారదశ (10 - 19 ఏండ్ల) పిల్లల జనాభా 253 మిలియన్లు ఉన్నారు. బాల్యవివాహాలు చేసికున్న కూతుర్ల సంఖ్యలో ప్రపంచ దేశాల్లో 4వ స్థానంలో ఉంది. వీరిలో అనారోగ్యం, చిన్నతనంలోనే తల్లి కావడం, పోషకాహారం అందకపోవడం, ఆర్థిక వెనుకబాటు, సంతానం బలహీనంగా ఉండటం వంటి సమస్యలు వెన్నాడుతాయి. కౌమారదశ బాలికల్లో 54 శాతం మరియు 30 శాతం బాలురు రక్తహీనతతో సతమతం అవుతున్నారు. మన దేశంలో 60-90 శాతం బాలికలు ఏదో ఒక సందర్భంలో లైంగిక అత్యాచారాలు, హింసలు లేదా వేధింపులను అనుభవిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 189 దేశాల మానవ అభివృద్ధి సూచిక జాబితాలో ఇండియా 130వ స్థానంలో ఉన్నది. భారతదేశ భాగ్యవిధాతలుగా ఎదగాల్సిన బాలలు ఆహారకొరత, పోషకాహారలోపం, అనారోగ్యం, అవిద్య, బాలకార్మిక వ్యవస్థ, బాలల లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు లాంటి తీవ్ర సమస్యలతో సంసారం చేస్తున్నారు.

కరోనాకు ముందు ప్రపంచవ్యాప్తంగా 47 మిలియన్ల బాలలు పోషకాహార (వేస్టింగ్) సమస్యలతో సహజీవనం చేస్తే, ప్రస్తుత కరోనా కాలంలో వారి సంఖ్య 54 మిలియన్లకు చేరడం మె?దటిసారి ఈ మిలినియంలో జరిగింది. కరోనా వ్యాప్తితో పేద దేశాలలోని పోషకాహార లోపంతో బాధపడుతున్న 5 సంవత్సరాల లోపు వయస్సున్న బాలల సంఖ్య 14.3 శాతం పెరిగిందని గుర్తించారు. దీని పర్యవసానంగా సగానికి పైగా బాలలు పోషకాహారలోపంతో మరణిస్తున్నారని అనుమానిస్తున్నారు. విశ్వవ్యాప్తంగా 250 మిలియన్ల బాలలకు విటమిన్-ఏ అందలేదని, దాదాపు 25 శాతం వరకు పోషకాహార లోపం పెరిగిందని తేల్చారు. వీటి ఫలితంగా 1.28 లక్షల అదనపు బాలల మరణాలు జరుగవచ్చని విశ్లేషించారు. గర్భిణి స్త్రీలకు అందవలసిన సమతుల పోషకాహారం అందక పోవడం కూడా పరిస్థితి తీవ్రతను మరింత జటిలం చేస్తుందని నివేదిక తెలుపుతోంది. బాలలకు జీవించడం, శారీరకంగా మానసికంగా ఎదగడం, వేధింపుల నుండి రక్షణ, అభివృద్ధిలో పాలుపంచుకోవడమనేవి రాజ్యాంగ హక్కులని గుర్తించింది. ఆకలి, అకాలమరణాలు, అత్యాచారాలు, బాలకార్మిక దురాచారం, విద్య, పోషకాహారం లాంటి సవాళ్ళను దేశం సమర్థవంతంగా ఎదుర్కోవలసి ఉంది. మన దేశంలో 2012-17 మధ్య కాలంలో 2.43 లక్షల బాలికలు/ మహిళలు కనబడకుండా పోయారు. కోవిడ్-19 అకాలంలో రేపటి పౌరుల పోషకాహార హక్కులను కాపాడేందుకు ఆయాదేశాల ప్రభుత్వాలు, సామాన్య ప్రజలు, స్వచ్ఛంధ సంస్థలు, దాతలు వెంటనే స్పందించాల్సిన సమయమిది. ఆహార ఉత్పత్తిరంగాల ప్రోత్సాహం, ఆహార సరఫరా నియంత్రణ, తల్లిపాల రక్షణ, బాలలకు మరియు తల్లులకు సమతుల ఆహార లభ్యతలను కాపాడాల్సి ఉంది. బాలల్లో పోషకాహార లోపాల్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవడం, పేద కుటుంబాలకు ఆహారాన్ని ఇంటి వద్దనే పంపిణి చేయడం, పాఠశాలల్లో సురక్షిత మధ్యాహ్న భోజనం కల్పించడం లాంటి అంశాలలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యూనిసెఫ్ ప్రణాళిక ప్రకారం కోవిడ్-19 ధాటికి తట్టుకుంటున్న విశ్వమానవాళి, ముఖ్యంగా ఐదేళ్ల లోపు బాలలను రక్షించుకోవడానికి రెస్పాండ్(స్పందించు), రికవర్(క్షేమంగా బయటపడడం) మరియు రీఇమేజిన్(తిరిగి రూపాన్నివ్వడం) అనబడే త్రిసుత్రాలను ప్రతిపాదించారు. సమస్య జటిలం కాక పూర్వమే తగు చర్యలు తీసుకోవడం, సమస్యలతో సతమతమవుతున్న వారిని రక్షించుకోవడం మరియు బయట పడిన వారిని సంరక్షించుకోవడం అనే విషయాలకు కట్టుబడి బాలలను మరియు తల్లులను ఆరోగ్యవంతులుగా చూసుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉందని నమ్ముదాం. రేపటి తరాన్ని పువ్వుల్లో పెట్టుకొని పెంచుకుంటూ, ఆరోగ్యకర యువభారతాన్ని నిర్మించుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

దిల్‌సుఖ్‌నగర్‌లో బస్ షెల్టర్లను ప్రారంభించిన మేయర్

హైదరాబాద్, నవంబర్ 13: నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌లో అధునాతన సదుపాయాలతో నిర్మించిన 6 బస్ షెల్టర్లను జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ రామ్మోహన్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యాధునిక పద్ధతుల్లో వెయ్యి బస్ షెల్టర్లను నిర్మించామని తెలిపారు. ఇప్పటికే 292 బస్ షెల్టర్లను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చామని గుర్తు చేశారు. ఏసీ బస్ షెల్టర్ల వద్ద వాటి భద్రతకై సెక్యూరిటీ గార్డులను నియమించామని తెలిపారు. హబ్సిగూడ డివిజన్‌లోని రవీంద్ర నగర్, గ్రీన్ హిల్స్ కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మేయర్ రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ బేతి స్వప్న రెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు హారతులు..రేపు పూజలు

నోములు, వ్రతాలు ఆదివారమే చేసుకోవాలంటున్న పండితులు

కొత్త అల్లుళ్లను పిలుచుకోవద్దని సూచన

యాదాద్రి భువనగిరి,నవంబర్13 (ఆర్ఎన్ఎ): చతుర్దశి నాడు వేకువజామునే తైలాభ్యంగన స్నానం చేసే సంప్రదాయం అనాదిగా వస్తున్నది. అంతేకాదు, నువ్వుల నూనెలో లక్ష్మీ కళలు ఆవహించి ఉంటాయి. చతుర్దశి తెల్లవారు జామున నువ్వులతో తలంటుకొని తలస్నానం చేస్తే లక్ష్మీప్రదం. నరక దుర్గతి నుంచి విముక్తి లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ప్రదోషకాలంలో దీపారాధన చేయాలి. ఈ దీపాలు లక్ష్మీకటాక్షం కలిగించడంతోపాటు పితృదేవతలకు నరకబాధను విముక్తిచేస్తాయని నమ్మకం.దీపావళి నాడు హారతులు ప్రధానమైన వేడుక. పుట్టింటికి వచ్చిన ఆడకూతుళ్లు ఇంట్లో ఉన్న మగవాళ్లందరికీ హారతులు ఇస్తారు. సంప్రదాయబద్ధంగా కొనసాగే ఈ వక్రియ శనివారం సూర్యోదయానికి ముందుచేసుకోవాలని సిద్ధాంతులు సెలవిస్తున్నారు. సూర్యోదయానికి ముందు కుదరని పక్షంలో, దుర్ముహూర్తం వెళ్లిపోయిన తర్వాత ఇవ్వొచ్చు. దుర్ముహూర్తం సూర్యోదయం నుంచి 1.36 గంటల నిడివి ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో సూర్యోదయం అయ్యాక 1.36 గంటల తర్వాత హారతులు ఇవ్వొచ్చని సిద్ధాంతులు సూచిస్తున్నారు. ఏటా అమావాస్య నాడు వచ్చే ఈ పండుగ ఈసారి రెండు రోజులపాటు జరుపుకొనున్నారు. అమావాస్య తిథి శని, ఆదివారాల్లో పరివ్యాప్తమై ఉన్నందున రెండురోజుల పర్వంగా మారింది. దీంతో హారతులు, లక్ష్మీపూజలు శనివారం, నోములు ఆదివారం చేసుకోవాలని పంచాంగకర్తలు సూచిస్తున్నారు. ఆశ్వీయుజ బహుళ చతుర్దశి, అమావాస్య తిథులు శనివారం కలిసి వచ్చాయి. శనివారం చతుర్దశి తిథి పగలు 1.35 గంటల వరకు ఉన్నది. తర్వాత అమావాస్య తిథి ప్రవేశిస్తున్నది. రాత్రంతా అమావాస్య తిథి పరివ్యాప్తమై ఉండటంతో దీపావళి శనివారమే చేసుకోవాలి. అమావాస్య తిథి ఆదివారం ఉదయం 11.15 గంటల వరకు ఉన్నది.

నిబంధనల మేరకే టపాసులకు అనుమతి

కడప,నవంబర్13(ఆర్ఎన్ఎ): కరోనా నిబంధనలను పాటించకుండా దీపావళి పండుగ రోజు టపాసులు కాలిస్తే చర్యలు తీసుకుంటామని కడప పోలీసులు హెచ్చరించారు. బాణాసంచా కాల్చవద్దన ఉత్తర్వులు ఉన్నాయని అన్నారు. టపాసుల పొగ ఊపిరి తిత్తుల మీద పడి మరణించే అవకాశం కరోనా రోగులకు ఎక్కువగా ఉంటుందన్నారు. కావున టపాసులు కాల్చే వాళ్లు తప్పక నిబంధనలు పాటించాలన్నారు. రాత్రి 8 - 10గంటల మధ్య మాత్రమే పొగ వెదజల్లని టపాసులు కాల్చుకోవాలన్నారు. టపాసులు కొనేవారు, కాల్చేవారు భౌతికదూరం పాటిస్తూ మాస్కులు ధరించాలన్నారు.

ఏనుగుల బీభత్సంతో గ్రామస్థుల ఆందోళన

విజయనగరం,నవంబర్13(ఆర్ఎన్ఎ): ఏనుగుల బీభత్సానికి ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. విజయనగరం జిల్లా లోని కొమరాడ మండలం పరశురాంపురం గ్రామంలో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. పంటల పొలాల్లోకి వచ్చిన గజరాజులు పంటను నాశనం చేశాయి. ఏనుగుల గుంపు బీభత్సంతో గ్రామానికి చెందిన స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఏనుగుల దాడిలో రఘు మండల లక్ష్మి నాయుడు(50) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గతంలో కూడ ఏనుగుల దాడికి కొంతమంది మృతి చెందగా, మరి కొంతమంది తీవ్ర గాయాలు పాలయ్యారు. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటనతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఏనుగులను దూరంగా తరిమేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

17న రాష్ట్ర మంత్రుల ఇళ్లవద్ద నిరసనలు

విజయనగరం,నవంబర్13(ఆర్ఎన్ఎ): కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలను రద్దు చేసేంతవరకు పోరాటాలు చేయాల్సిన బాధ్యత అన్ని రంగాల వారిపై ఉందని సిఐటియూ నేతలు అన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 26న జరుపతలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లు, వ్యవసాయ చట్టాలు ఆయా రంగాల కార్మికులకు తీరని నష్టాన్ని చేకూరుస్తాయని అన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని కోరుతూ ఇటీవల కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని, కార్మికుల నిధి రక్షణ కోసం ఈనెల 17న రాష్ట్ర మంత్రుల ఇళ్ల వద్ద నిరసన, 26న జరగనున్న అఖిల భారత సమ్మెలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సన్నాలకు వెంటనే మద్దతు ప్రకటించాలి: కాంగ్రెస్

పెద్దపల్లి,నవంబర్13(ఆర్ఎన్ఎ): కేసీఆర్ ఆదేవాల మేరకు సన్నాలు పండించినందున సన్నాలకు మద్దతు ధరలు నిర్ణయించి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. రైతులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోక పోవడం దారుణమని ఆ పార్టీ పేర్కొంది. తక్షణం మద్ద

నేరాల నిరోధానికి ముందస్తు చర్యలు తీసుకోవాలి

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్ నవంబర్ 13 (నేటినిజం ప్రతినిధి): నేరాల నిరోధానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ముందస్తు చర్యల ద్వారా పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంపొందుతుందని పేర్కొన్నారు.

కరీంనగర్ కమిషనరేట్ నేరసమీక్షా సమావేశం శుక్రవారంనాడు జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ కేసులను వేగవంతంగా చేధించాలన్నారు. నాన్‌బేలబుల్ వారెంట్ల అమలులో జాప్యం చేయకూడదని పేర్కొన్నారు. నేరాలఛేదనకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంపొందించేందుకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. నిందితులు శిక్షింపబడటం ద్వారా నేరాలు నియంత్రణలోకి వస్తాయని తెలిపారు. ప్రతినెల ఫిర్యాదుదారుల ఫీడ్‌బ్యాక్‌డేను నిర్వహించి కేసుల పురోగతిని తెలుపాలని సూచించారు. హాక్‌ఐయాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్, ఏసిపిలు అశోక్, విజయసారధి, శ్రీనివాసరావు, మదన్‌లాల్, శ్రీనివాస్, ఎస్‌బిఐ ఇంద్రసేనారెడ్డిలతోపాటుగా పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బైక్ దొంగలు అరెస్టు.. 30 బైక్‌లు స్వాధీనం

హైదరాబాద్, నవంబర్ 13: బైక్‌లు దొంగతనం చేస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాను నగరంలోని సైబరాబాద్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సైబరాబాద్ సీపీ సజ్జనార్ మీడియా ద్వారా వివరాలను వెల్లడించారు. ముఠా సభ్యులు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైకులను దొంగిలిస్తున్నారన్నారు. ముఠా ప్రధాన సూత్రధారి రాజ్‌కుమార్ అన్నారు. ముఠాలో నలుగురు బాల నేరస్థులు ఉన్నట్లు వీరిని జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు. చెడు అలవాట్లు, జల్సాలకు బానిసలై ముఠా సభ్యులు చోరీలు చేస్తున్నట్లుగా వెల్లడించారు. చోరీ చేసిన బైక్‌లను నాందేడ్‌లో అమ్మేవారన్నారు. ముఠా నుంచి 30 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ పేర్కొన్నారు.

బౌద్ధ మతంలో విభిన్నంగా దీపావళి

భిక్షులకు స్వాగతం పలికేలా దీపాల వరుస

అమరావతి,నవంబర్13(ఆర్ఎన్ఎ): దీపావళికి ఒక్కోచోట ఒక్కో విధమైన కథ ప్రచారంలు ఉంది. అలాగే బౌద్ధంలోనూ ఓ కత ప్రచారంలో ఉంది. ప్రతి ఆషాఢ మాసంలో బౌద్ధ భిక్షువులకు వర్షావాసం ప్రారంభ మవుతుంది. ఆ కాలంలో మూడు నెలల పాటు భిక్షువులు ప్రజల వద్దకు భిక్ష కోసం వెళ్ళరు. అడవుల్లో, గుహల్లో ఉండి... దొరికింది తింటూ, ధ్యానంలో, విద్యలో ప్రత్యేక స్వయం శిక్షణ సాగిస్తారు. ఇలా వర్షావాసం పూర్తి చేసి, ఆశ్వయుజ మాసంలో తిరిగి గ్రామాలకు బయలుదేరుతారు. గ్రామాలకు వచ్చే భిక్షువులకు దారి పొడవునా దీపాలతో ప్రజలు స్వాగతం పలుకుతారు. అదే దీపావళిగా, బౌద్ధుల ధర్మ దీపావళిగా ప్రసిద్ధం చెందింది. బౌద్ధులు మరణాన్ని నిర్వాణం అంటారు. నిర్వాణం అంటే దీపం ఆరిపోవడం. ప్రమిదలోని నూనె, వత్తీ పూర్తిగా మండిన తరువాత ఇక దీపం వెలుగదు. అదే నూనె, అదే వత్తి ఇక ఉండవు. అంటే... అదే దీపాన్ని ఇక ఎప్పటికీ వెలిగించలేం. మనిషి నిర్వాణం తరువాత కూడా అంతే! ఇలా అనిత్యత్వాన్నీ, అనాత్మవాదాన్నీ దీపంతో పోల్చి చెబుతుంది బౌద్ధం. మరణించిన వ్యక్తి తల దగ్గర దీపం ఉంచే సంప్రదాయం బౌద్ధ భిక్షువుల నిర్వాణం నుంచి పుట్టినదే! స్తూపాల మీద దీపాలు ఉంచే ఆచారం కూడా దాన్నుంచి వచ్చిందే! అందుకే మరణాన్ని దీపం ఆరడంతో పోలుస్తాం. మనుషులు చీకటి నుంచి వెలుగులోకి, వెలుగు నుంచి వెలుగులోకి నడవాలని అంటుంది బౌద్ధం. చీకటి నుంచి వెలుగులోకి నడవడం అంటే అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు పయనించడం అని అర్థం. వెలుగు నుంచి వెలుగులోకి' అంటే 'విజ్ఞానం నుంచి శీలం వైపు పయనించడం' అని అర్థం. ఇలా మనిషికి శీలం, విజ్ఞానం ఈ రెండూ కలిసి ఉంటేనే పరిపూర్ణత. వేల ఏళ్ల క్రితమే బౌద్ధంలో దీప పూజ మొదలయింది. బౌద్ధ స్తూపాల దగ్గర, బౌద్ధ ఆరామాల్లో

వందలాది దీపాలు వెలిగించేవారు. బౌద్ధ ధర్మోపన్యాసాలు, దాన కార్యక్రమాలు జరిగే ప్రదేశాలను దీపాలతో నింపేవారు. తమ గ్రామానికి బుద్ధుడు భిక్షువులతో కలిసి వచ్చిన సందర్భాల్లో ఇంటింటా దీపాలను వెలిగించి, ఆహ్వానం పలికే సంప్రదాయం బలీయంగా సాగింది. ఇల్లు వదలి వచ్చిన సిద్ధార్థుడు ఆరేళ్ళు కృషి చేసి, చివరకు జ్ఞానోదయం పొంది బుద్ధుడయ్యాడు. సారనాథ్‌లో మొదటి వర్షావాసం ముగించి రాజగృహకు వచ్చాడు. ఆ సమయంలో... బుద్ధుడైన తన బిడ్డను కపిలవస్తు నగరానికి తీసుకురావాలని మంత్రుల్ని ఆయన తండ్రి శుద్ధోధనుడు ఆదేశిస్తాడు. చివరకు సిద్ధార్థుడి బాల్య మిత్రుడైన కాలు ఉదాయిని పంపుతాడు. కాలు ఉదాయి బుద్దుణ్ణి వెంటబెట్టుకొని కపిలవస్తుకు వస్తాడు. ఆ సందర్భంలో బుద్ధునికి శుద్ధోదనుడు దారిపొడవునా దీపాలు వెలిగించి స్వాగతం పలికాడు. ఆ రోజు రాజ్యమంతటా దీపాలు వెలిగించారు. అలా బుద్ధుడి కపిలవస్తు నగర పునరాగమనానికి సంకేతంగా దీపాలవెల్లి బౌద్ధ సంప్రదాయంగా నిలిచిపోయిందని అంటారు.

ప్రాణహితలో తల్లీకూతురు లభ్యం.. మరి భర్త ఎక్కడ?

కుమ్రంభీం ఆసిఫాబాద్,నవంబర్ 13 : జిల్లాలోని చింతలమానేపల్లి మండలం బూరేపల్లిలో విషాదం నెలకొంది. తల్లీకూతురు మృతదేహాలు ప్రాణహిత నదిలో లభ్యం కాగా, భర్త ఆచూకీ లభించడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. రాజు(35), శ్యామల(30)కు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి శ్రీవిద్య(4), అనూష(2) అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండటంతో.. శ్యామల తన పుట్టింటికి వెళ్లేది. శ్యామల పుట్టిల్లు మహారాష్ట్రలోని ఓ గ్రామం. గురువారం కూడా భార్యభర్తల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో శ్యామల తన ఇద్దరు పిల్లలను తీసుకుని ప్రాణహిత నది మీదుగా తన పుట్టింటికి బయల్దేరింది. వికలాంగుడైన రాజు.. వారి వెనుకాలే వెళ్లి శ్రీవిద్యను వెనక్కి తీసుకువచ్చాడు. ఆ పాపను బంధువుల ఇంటి వద్ద ఉంచి రాజు.. మళ్లీ వెళ్లిపోయాడు. అయితే శుక్రవారం తెల్లవారుజామున శ్యామల, అనూష మృతదేహాలు ప్రాణహిత నదిలో లభ్యమయ్యాయి. రాజు చెప్పులు సమీపంలో ఉన్న ఓ బావి వద్ద ఉన్నాయి. కానీ బావిలో ఎలాంటి మృతదేహం లభ్యం కాలేదు. శ్యామల, అనూష మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. శ్యామల, అనూష హత్యకు గురయ్యారా? లేక ఆత్మహత్య చేసుకున్నారా? అనే విషయం రాజు దొరికితే గానీ తేలదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

239 జిన్నింగ్,స్పిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోళ్లు

పత్తి కొనుగోళ్లపై అధికారులతో కిషన్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): సోమవారం నుండి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 293 జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. చివరి క్వింటా పత్తి వరకు కొనుగోలు చేయాలని ఆదేశించామని అన్నారు.

పత్తి సేకరణ కేంద్రాలు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పనిచేస్తాయని అన్నారు. అలాగే చివరి క్వింటా వరకు సిసిఐ ద్వారా కొనుగోలు ఉంటుందని అన్నారు. దాని కోసం తగు ఆదేశాలు జారీ చేశామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీపావళి పండుగ తరువాత నుంచి కార్యకలాపాలు సాగుతాయని అన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో సిసిఐ, నాఫెడ్, ఎఫ్‌సిఐ, తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ అధికారులతో జరిగింది. సమావేశం అనంతరం, పిఐబి డైరెక్టర్ జనరల్ వేంకటేశ్వర్‌తో కలిసి మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతులకు పూర్తి లాభసాటి ధర లభించేటట్లు పత్తి సేకరణ ఉండాలని, దళారుల, ప్రైవేటు వ్యాపారస్తులను అనుమతించరాదని మంత్రి స్పష్టం చేశారు. పత్తి సేకరణ విషయంలో నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించే అధికారులపట్ల కఠిన చర్యలు తీసుకోవాలని సిసిఐ, డిజిఎమ్, అమర్‌నాథ్ రెడ్డిని కేంద్రమంత్రి ఆదేశించారు.

రైతులు మార్కెట్ కు తీసుకువచ్చే పత్తిలో తేమ శాతం తక్కువగా ఉండేటట్లు రైతులకు కరపత్రాల ద్వారా సిసిఐ అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి అన్నారు. ఆధార్ ఆధారిత నగదు బదిలీని పత్తి సేకరణలో ఉపయోగిస్తున్నామని, పారదర్శకంగా కొనుగోలు పక్రియ ఉంటుందని మంత్రి తెలిపారు. ప్రతి సేకరణ కేంద్రంలో తేమ శాతాన్ని కొలిచే యంత్రాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం పత్తి దిగుబడి తగ్గే అవకాశం ఉన్నప్పటికీ అన్ని రకాల జాగ్రత్తలతో రైతులకు పూర్తి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని మంత్రి తెలిపారు. తొందరపడి తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారస్తులకు పత్తిని అమ్మవద్దని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా రైతులని కోరారు. వరి పంటకు సంబంధించి కేంద్ర మంత్రి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకే తెలంగాణ రాష్ట్రంలో అధిక సంఖ్యలో రైతులు సన్నరకాలు వరిని పండించారని, దానిని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే సేకరిస్తుందని చెప్పారని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుతం ఆ ధాన్యాన్ని కొనే పరిస్థితి లేదని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని అన్నారు.

తెలంగాణాలో రైతులు పండించిన సన్నరకాల వరిని సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కిషన్ రెడ్డి కోరారు. అలాగే, బోనస్ కూడా చెల్లిస్తామని ముఖ్యమంత్రి చెప్పిన విషయం గుర్తు చేస్తూ, ప్రస్తుతం దానిని అమలు చేయాలని అన్నారు. నేషనల్ కోపరేటివ్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సిడిసి) ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అనేక పథకాలకు, కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్న విషయాన్ని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన నూతన వ్యవసాయ చట్టాలు రైతులకు మరింత మేలు చేసే విధంగా ఉన్నాయని, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అమలుచేసి, రైతులకు లబ్ది చేకూర్చాలని కిషన్ రెడ్డి కోరారు.

ప్రభుత్వ ఉద్యోగుల జాబితాలో ఆర్టీసీ ఉద్యోగులు

కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం న్యాయసమ్మతమైన నివేదిక అధికారుల సమీక్షలో సిఎం జగన్ ఆదేశాలు

అమరావతి,నవంబర్13(ఆర్ఎన్ఎ): కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించిన విషయం న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున, ఆ ఇబ్బందులు తలెత్తకుండా వారికి ఆర్థికంగా ప్రయోజనాలు చేకూర్చేందుకు తగిన విధి విధానాలు రూపొందించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంలో విలీనం చేసిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)కు చెందిన దాదాపు 52 వేల మంది ఉద్యోగులను కూడా ప్రభుత్వ ఉద్యోగుల జాబితాలో చేర్చి, సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి గత ప్రభుత్వం కొన్ని జీవోలు జారీ చేసి, వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదని అన్నారు. అయితే తన ప్రభుత్వం వచ్చాక వాటన్నింటినీ అమలు చేశామని చెప్పారు. అదే విధంగా మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) కూడా అమలు చేశామని వెల్లడించారు. కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం (సీపీఎస్), కాంట్రాక్ట్ ఉద్యోగులపై క్యాంప్ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీపీఎస్ సంబంధించిన పూర్తి సమాచారాన్ని అధికారులు సమావేశంలో వివరించారు. సీపీఎస్‌పై ఏర్పాటు చేసిన మంత్రుల బృందం, సీఎస్ నేతృత్వంలో వివిధ శాఖల కార్యదర్శుల కమిటీలు, అంతకు ముందు ఇచ్చిన టక్కర్ కమిటీ నివేదికను కూడా పరిశీలించారని అధికారులు సీఎంకు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు, యూనివర్సిటీలు, విద్యా సంస్థల్లో 1,98,221 మంది సీపీఎస్‌లో ఉన్నారని వివరించారు. వారిలో నేరుగా ప్రభుత్వ ఉద్యోగులు 1,78,705 కాగా గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద 3,295 మంది ఉండగా మిగిలిన 16,221 మంది యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో పని చేస్తున్నారని చెప్పారు. వారికి ఏ పెన్షన్ విధానాన్ని అమలు చేస్తే ఎంత వ్యయం అవుతుందన్న వివరాలను అధికారులు ప్రస్తావించారు. వాటన్నింటికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ తగు చర్యలకు ఆదేశించారు. సీఎస్ నీలం సాహ్ని, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, సాధారణ పరిపాలన శాఖ (సర్వీసులు) కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.గిరిజాశంకర్, పురపాలక పరిపాలన శాఖ కమిషనర్ విజయకుమా ర్‌తో పాటు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. కాంట్రిబ్యూటరీ పింఛను పథకానికి (సీపీఎస్) సంబంధించిన పూర్తి సమాచారాన్ని అధికారులు సమావేశంలో వివరించారు. సీపీఎస్‌పై ఏర్పాటు చేసిన మంత్రుల బృందం, సీఎస్ నేతృత్వంలో వివిధ శాఖల కార్యదర్శుల కమిటీలు, అంతకు ముందు ఇచ్చిన టక్కర్ కమిటీ నివేదికను కూడా పరిశీలించారని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు, యూనివర్సిటీలు, విద్యా సంస్థల్లో 1,98,221 మంది సీపీఎస్‌లో ఉన్నారని, వారిలో నేరుగా ప్రభుత్వ ఉద్యోగులు 1,78,705 కాగా, గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద 3,295 మంది ఉండగా మిగిలిన 16,221 మంది యూనివర్సిటీలు, విద్యా సంస్థల్లో పని చేస్తున్నారని చెప్పారు. వారికి ఏ పెన్షన్ విధానాన్ని అమలు చేస్తే ఎంత వ్యయం అవుతుందన్న వివరాలను అధికారులు ప్రస్తావించారు.

సరిహద్దు గ్రామాల అభివృద్ధికి చర్యలు

డోర్డో గ్రామం అభివృద్ధిలో పాల్గొన్న అమిత్ షా

గాంధీనగర్,నవంబర్13(ఆర్ఎన్ఎ): గత 50 ఏళ్లలో ఏన్నడూ లేనంతగా దేశ సరిహద్దు గ్రామాల అభివృద్ధి జరిగిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం గత ఆరేళ్లలో దేశ సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను గణనీయంగా అభివృద్ధి పరిచినట్లు తెలిపారు. సరిహద్దు గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సిమంత్ క్షేత్ర వికాసోత్సవ్ -2020 కార్యక్రమాన్ని చేపట్టింది.

ఇందులో భాగంగా గుజరాత్‌లోని కుచ్ జిల్లాలో గల డోర్డో గ్రామంలో గురువారం చేపట్టిన కార్యక్రమంలో హోంమంత్రి పాల్గొన్నారు. పాకిస్తాన్‌తో భూ సరిహద్దును పంచుకునే కచ్, బనస్కాంత, పటాన్ జిల్లాల నుంచి ప్రతినిధులు, సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. రక్షణ దళాల వైమానిక దాడులు, ఎయిర్ స్ట్రైక్స్ గురించి ప్రస్తావించారు. గతంలోలాగా దౌత్య పరమైన ప్రకటనలు జారీ చేసి ఊరుకోవడం లేదన్నారు. శత్రువులకు తగిన సమాధానం ఇస్తున్నామన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ సరిహద్దులో ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. దివంగత సర్దార్ వల్లభాయ్ పటేల్ వలసలను ఆపేందుకు సరిహద్దు గ్రామాలకు నీరు, విద్యుత్ అందించాలన్నారు. ఆయన మరణం తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని విస్మరించిందన్నారు. కానీ ఇప్పుడు మోడీ ఆ పనిని చేపట్టారన్నారు. 2008 నుంచి 2014 మధ్య సరిహద్దు ప్రాంతాలలో కేవలం 170 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాలు జరిగితే మోదీ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2020 మధ్య 480 కిలోమీటర్ల రోడ్లు పునర్నిర్మించినట్లు తెలిపారు. అదేవిధంగా 2008 నుంచి 2014 మధ్య సరిహద్దు ప్రాంతాల్లో కేవలం ఒక సొరంగాన్ని మాత్రమే నిర్మించారు. అదే 2014 నుంచి 2020 మధ్య ఆరు సొరంగాలు ఇప్పటికే నిర్మించబడ్డాయన్నారు. మరో 19 సొరంగాల పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి ఈ గణాంకాలే నిదర్శనమన్నారు. సరిహద్దు ప్రాంత అభివృద్ధి కోసం 2020-21 సంవత్సరానికి రూ. 11,800 కోట్ల బ్జడెట్‌ను కేటాయించినట్లు వెల్లడించారు. దేశం తన అంతర్గత భద్రతను బలోపేతం చేయకుండా అభివృద్ధి మార్గంలో ముందుకు సాగదన్నారు. సరిహద్దు నుండి ప్రజల వలసలను ఆపడం అవసరం అన్నారు. సరిహద్దు ప్రాంతాలకు ఆరోగ్య సంరక్షణ, విద్య, నగరాలతో సమానంగా మంచి కనెక్టివిటీ సౌకర్యాలు లభించేలా చూడటమే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహణ వెనుక ముఖ్య ఉద్దేశం అని అమిత్ షా అన్నారు.

సిఎం సహాయనిధికి చెక్కులు అందచేత

హైదరాబాద్,నవంబర్12(ఆర్ఎన్ఎ): వరదలతో తీవ్రంగా నష్టపోయిన హైదరాబాద్ ప్రజలను ఆదుకునేందుకు బెల్జియంకు చెందిన ప్రముఖ బేవరేజెస్ సంస్థ, తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ ముందుకు వచ్చింది. సీఎం రిలీఫ్ ఫండ్‌కు భారీగా విరాళం ఇచ్చారు. బేవరేజెస్ సంస్థ దక్షిణాసియాకు చెందిన కార్పొరేట్ హెడ్ దినకర్, కమర్షియల్ డైరెక్టర్ ఇషాంక్ గుప్తా కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌కు రూ. 50 లక్షల చెక్కును అందజేశారు. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ ఎజీఎం టీ శ్రీధర్ కూడా సోమేశ్ కుమార్‌కు రూ. 25 లక్షల చెక్కును అందించారు.

నటుడు చిరంజీవికి ఈటెల ఫోన్ పరామర్శ

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): నటుడు చిరంజీవిని మంత్రి ఈటల రాజేందర్ ఫోన్లో పరామర్శించారు. చిరంజీవి ఆరోగ్య పరిస్థితిని ఈటల అడిగి తెలుసుకున్నారు. చిరంజీవి త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నానని ఈటల రాజేందర్ చెప్పారు. చిరంజీవి కరోనా బారినపడ్డారు. తనకు కరోనా సోకిన విషయాన్ని చిరంజీవి స్వయంగా ప్రకటించారు. ఆచార్య సినిమా షూటింగ్‌లో పాల్గొనే ముందు ప్రొటోకాల్ ప్రకారం కొవిడ్ టెస్ట్ చేయించుకుంటే పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతానికి లక్షణాలు లేవు. హోం క్వారంటైన్ అయ్యానని మెగాస్టార్ ఓ ప్రకటనలో తెలిపారు. చిరంజీవి ప్రకటనతో ఆయన్ను కలిసిన వారంతా ఉలిక్కిపడ్డారు. సీఎం కేసీఆర్, ఎంపీ సంతోష్ కుమార్.. చిరంజీవిని కలిసిన తర్వాత పరీక్షలు చేయించుకున్నట్లు తెలిసింది. ఇద్దరికీ నెగెటివ్ వచ్చినట్లు సమాచారం. అయినప్పటికీ ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు సీఎం వెళ్లగా.. సంతోష్ హోం క్వారంటైన్ అయ్యారు.

ఉద్ధవ్ సర్కార్ దానంతటదే కూలుతుంది

తామేమీ మార్పు కోవడం లేదు
థాకరే ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైంది
మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

ముంబయి,నవంబర్13(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో ఉద్ధవ్ థాకరే ప్రభుత్వం దానంతట అదే కూలిపోతుందని ఆ రాష్ట్ర మాజీ సిఎం, బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవిస్ జోస్యం చెప్పారు. సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడానికి బిజెపి ఏమీ చేయాల్సిన అవసరం లేదని అన్నారు. బీహార్ లో ఎన్డీయే కూటమి మరోసారి అధికారాన్ని చేపట్టనున్న నేపథ్యంలో ఫడ్నవిస్ మాట్లాడుతూ, ఈ వ్యాఖ్యలు చేశారు. బీహార్ ఫలితాలు తమ ఆత్మవిశ్వాసాన్ని పెంచా యని చెప్పారు. మహారాష్ట్రలోని ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైందని. ఇలాంటి ప్రభుత్వం ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని ఫడ్నవిస్ అన్నారు. ఈ ప్రభుత్వం కూలిపోతే. తాము ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే ఇప్పటికిప్పుడే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన తమకు లేదని అన్నారు. మహారాష్ట్రలో తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం నెలకొందని, రైతులు ఎంతో ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కష్టాల్లో ఉన్న రైతులకు కనీస ఆర్థిక సా యాన్ని కూడా అందించడం లేదని దుయ్య బట్టారు. ప్రతిపక్ష పార్టీగా రైతుల సమ స్యలపై ప్రభుత్వంతో తాము పోరాడుతూనే ఉంటామని చెప్పారు. బీహార్ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాలతో పాటు, పశ్చిమబెంగాల్ ఎన్నికలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని ఫడ్నవిస్ అన్నారు. పశ్చిమబెంగాల్ లో మార్పును మనమంతా చూస్తామని చెప్పారు. పశ్చిమబెంగాల్ లో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

తొలిసారి భారత్ మాంద్యంలోకెళ్లింది

ప్రధాని మోదీ వల్లే భారత ఆర్థిక వ్యవస్థ క్షీణించింది

న్యూఢిల్లీ,నవంబర్13(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్ర మోడీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లనే దేశంలో ఆర్థిక మాంద్యం నెలకొందని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు.

భారత్ తొలిసారి ఆర్థిక మాంద్యంలోకి ప్రవేశించిందని ఆర్ బిఐ గురువారం ప్రకటించింది.

ఈ క్రమంలో మోడీపై రాహుల్ గాంధీ మండిపడ్డారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరించడం వల్లనే భారత ఆర్థిక వ్యవస్థ క్షీణించిందని ఆయన ధ్వజమెత్తారు.

మోడీ అనుసరిస్తున్న విధానలతో దేశంలోని బలాలన్నీ బలహీనతలుగా మారాయని ఆయన ఆరోపించారు. దేశ జీడీపీ రెరడో క్వార్టర్‌లో మైనస్ 8.6 శాతానికి క్షీణించనున్నట్లు ఆర్బీఐ తన నౌకాస్ట్ నివేదికలో పేర్కొన్న క్రమంలో రాహుల్ గాంధీ మోడీని విమర్శిస్తూ ట్వీట్ చేశారు.

గాంధీలో ఇక సాధారణ వైద్యసేవలు

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): త్వరలో గాంధీ ఆస్పత్రిలో నాన్ కోవిడ్ సేవల ప్రారంభానికి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మార్గదర్శకాలు ఇచ్చారు. తక్షణం కోవిడ్, నాన్ కోవిడ్ రోగులను ఉంచేందుకు ఆస్పత్రిలో వేర్వేరు ప్రాంతాలను కేటాయించాలని ఆదేశించారు. ఈ నెల 21 లోపు గాంధీలో నాన్ కోవిడ్ సేవలు ప్రారంభించాలని ఆదేశించారు. గాంధీలో గతంలో ఉన్న అన్ని వైద్య సేవలను కొనసాగించాలని డీఎంఈ చెప్పారు. రోగులకు అనుగుణంగా స్టాఫ్‌ని కేటాయించాలని డీఎంఈ ఆదేశాలిచ్చారు. కరోనా వైరస్ ఆరంభం అయినప్పటి నుంచీ గాంధీ జనరల్ హాస్పిటల్, ప్రభుత్వ ఛాతీ-జనరల్ హాస్పిటల్, ఫీవర్ హాస్పిటళ్ళను కూడా కోవిడ్ -19చికిత్స ప్రత్యేక ఆసుపత్రులుగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి గాంధీ ఆసుపత్రిలో కోవిడ్ రోగులకు చికిత్స అందిస్తున్నారు.

టిఆర్ఎస్ కార్యకర్త మృతికి సంతాపం

పెద్దపల్లి,నవంబర్13(ఆర్ఎన్ఎ): జిల్లాలోని కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన టీఆర్ఎస్ నేత పులి సత్యనారాయణ రెడ్డి ఇటీవల జరిగిన దుబ్బాక ఎన్నికల్లో ..టీఆర్ఎస్ అభ్యర్థి ఓటమిని తట్టుకోలేక గుండెపోటుతో మరణించాడు. అతని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. బాధిత కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనెటి సంపత్, జడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ చదువు రామచంద్రా రెడ్డి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు దేవయ్య,వైస్ ఎంపీపీ జూకంటి శిరీష తదితరులున్నారు.

మెరుగైన వైద్యం కోసమే బస్తీ దవాఖానాలు

కూకట్‌పల్లిలో మరో బస్తీ దవాఖాన ప్రారంభించిన మంత్రి

మేడ్చల్ మల్కాజిగిరి,నవంబర్13(ఆర్ఎన్ఎ): ప్రజలకు మెరుగైన వై

సిఎం జగన్ రాజీనామా చేయాల్సి రావచ్చు

కోర్టు ధిక్కరణ కింద నోటీసులు రావొచ్చన్న ఎంపి రఘుమా

న్యూఢిల్లీ,నవంబర్13(ఆర్ఎన్ఎ): మాజీ సీఎంలు నీలం సంజీవరెడ్డి, ఎన్.జనార్ధన్‌రెడ్డిలా జగన్ కూడా సీఎం పదవికి రాజీనామా చేయాల్సి రావొచ్చని నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు జోస్యం చెప్పారు. లేపోమాపో కోర్టు ధిక్కరణ నోటీసులు తీసుకోవడానికి జగన్ సిద్ధంగా ఉండాలన్నారు. కోర్టు నోటీసులపై తమ పార్టీలో ఆందోళన వ్యక్తమవుతోందని, తప్పు ఒప్పుకుని కోర్టులను క్షమాపణ కోరితే జగన్‌కు శిక్ష తప్పొచ్చన్నారు. ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా.. జగన్‌కు దుబ్బాక ఫలితం తప్పదని చెప్పారు. అమరావతి మాత్రమే ఏపీకి రాజధానిగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జగన్ మత మార్పిడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. సింహాద్రి, మాన్సాస్ భూములపై ప్రభుత్వ పెద్దల కన్ను పడిందని రఘురామకృష్ణరాజు చెప్పారు. ఎవరైనా కింది కోర్టు ఇచ్చిన తీర్పులపై పైకోర్టుకు వెళ్లడం సహజం. కానీ, వైసీపీ పెద్దలు జడ్జిల చిత్తశుద్ధి మీదే అనుమానాలున్నాయంటూ పెద్ద వివాదానికి తెరలేపారు. నిర్దిష్టంగా కొందరు న్యాయమూర్తులపై ఆరోపణలు చేస్తూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు అక్టోబర్ 6వ తేదీన లేఖ రాశారు. దానిని... 8వ తేదీన అందించినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత రెండు రోజుల్లోనే ఆకస్మికంగా మీడియా ముందుకు వచ్చేశారు. 'హైడ్రామా' సృష్టించారు. సీజేకు ఇచ్చిన ఫిర్యాదుతోపాటు పలురకాల పత్రాలు బహిర్గతం చేశారు. జడ్జిల పేర్లు ప్రస్తావిస్తూ ఆరోపణలు చేశారు. నిజంగా న్యాయ వ్యవస్థపైన, సుప్రీంకోర్టు పైన గౌరవం ఉంటే... తమ ఫిర్యాదుపై చీఫ్ జస్టిస్ స్పందన కోసం వేచి చూసేవారని, ఫిర్యాదు పత్రాలు బహిర్గతం చేసే వారు కాదని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. మీడియా ముందు రచ్చ చేయడంతో వైసీపీ పెద్దల దురుద్దేశాలు బయటపడిపోయాయని అభిప్రాయపడుతున్నారు.

రాజన్నను దర్శించుకున్న: టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 13 (నేటినిజం ప్రతినిధి): టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ కరీంనగర్ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ శుక్రవారం శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు .అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు కండువా కప్పి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు .ఆయన వెంట వేములవాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆది శ్రీనివాస్ గారు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి నాయకులు సగ్గు పద్మ దేవరాజు పాత సత్యలక్ష్మి కూరగాయల కొమురయ్య కనికరపు రాకేష్ మంత్రి నాగభూషణం లక్ష్మి వనపర్తి శంకర్ గారి పెళ్లి శివప్రసాద్ గుప్తా తదితరులు ఉన్నారు

యువకునికి మిలీనియం ఫౌండేషన్ సాయం

-రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నవీన్

రెండు కాళ్లు,చెయ్యి విరగడంతో ఆస్పత్రిలో శస్త్రచికిత్స వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 13 (నేటినిజం ప్రతినిధి):యువకుడు వైద్యం కోసం ఎదురుచూస్తుండగా వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.మిలీనియం ఫౌండేషన్ వివరాల్లోకి వెళితేబోయిని పల్లి మండలం దుండ ర పల్లి గ్రామానికి చెందిన నవీన్ గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు , చెయ్యి విరిగిపోయింది విషయం తెలుసుకున్న మిలీనియం ట్రస్ట్ వారు స్పందించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీన్ కు ఫౌండేషన్ సభ్యులు రూ . 10,000 ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. నవీన్ కు ఇలా జరగడం చాలా బాధాకరమని , అతను త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను అని అన్నారు .

అల్లాడి శేఖర్ కుటుంబానికి పరామర్శ

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 13 (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన ఆంధ్రప్రభ రిపోర్టర్ అల్లాడి శేఖర్ అనారోగ్యంతో గత ఆరు రోజుల క్రితం మరణించగా శేఖర్ కుటుంబ సభ్యులను శుక్రవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టిఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు, ఈ సందర్భంగా అల్లాడి శేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో మూడపల్లి సర్పంచ్ చిలుక అంజిబాబు,కోరేం సింగిల్ విండో ఛైర్మెన్ కిషన్ రెడ్డి, నాయకులు బైరగోని రమేష్, వెంగల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

మనలోని చెడును నరకాలి

మంచితో ముందుకు సాగాలి

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): నరకాసురుడు మంచి వంశం నుంచి వచ్చినవాడే. అతను విష్ణుమూర్తి కుమారుడని పురాణ గాథలు చెబుతున్నాయి. నరకాసురుడిలో కొన్ని చెడు ధోరణులు ఏర్పడ్డాయి. అతనికి మురాసురుడు అనే మిత్రుడున్నాడు. మురాసురుణ్ణి నరకుడు సేనానిగా చేసుకున్నాడు. వారిద్దరూ కలిసి ఎన్నో యుద్ధాలు చేశారు. వేలాది మందిని చంపారు. వారిద్దరినీ ఒకేసారి చంపడం కష్టం. కాబట్టి కృష్ణుడు మొదట మురాసురుణ్ణి చంపాడు. కృష్ణుడికి 'మురారి' అనే పేరు రావడానికి కారణం ఇదే! మురాసురుడికి మాయలు తెలుసు. వాటి వల్ల అతని ముందు యుద్ధంలో ఎవరూ నిలబడలేకపోయేవారు. మురాసురుడి వధ తరువాత నరకాసుర వధ తేలికయింది. నరకాసురుణ్ణి విడిచిపెట్టినా అతను పద్ధతుల్ని మార్చుకోడని కృష్ణుడికి తెలుసు. యుద్ధంలో నరకుణ్ణి మృత్యు ముఖానికి తీసుకువచ్చేసరికి, అతనికి జ్ఞానోదయం అయింది. అనవసరంగా చాలా చెడును మూట కట్టుకున్నానని అతను గ్రహించాడు. నువ్వు నన్ను చంపడం లేదు. నాలోని చెడును తొలగిస్తున్నావు. నాకు మంచే చేస్తున్నావు. ఈ విషయం అందరికీ తెలియాలి. నేను పోగు చేసుకున్న దోషాలు నాశనం అవుతున్న ఈ రోజును అందరూ పండుగ చేసుకోవాలి. ఈ రోజు నాకు ఒక కొత్త వెలుగును ఇచ్చింది. ఆ వెలుగు ప్రతి ఒక్కరూ పొందాలి అని కృష్ణుణ్ణి నరకాసురుడు కోరాడు. ఆ విధంగా ఆ రోజు దీపావళి పండుగ అయింది. ఈ రోజు దేశమంతా వెలుగులతో నిండిపోవాలి. ఆ వెలుగు మనలోని మలినాలను కాల్చెయ్యాలి. దానికోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. నేను నిన్ను చంపబోతు న్నాను అని నరకుడికి కృష్ణుడు చెప్పాడు. మనకు అలా చెప్పేవారు ఎవరూ ఉండరు. మనకు తెలియ కుండానే అది జరిగిపోవచ్చు. మృత్యువు మనల్ని ఎప్పుడు తీసుకుపోతుందో మనకు చెప్పదు. అది మనిషి రూపంలో రావచ్చు. మరణానికి కారణం బ్యాక్టీరియా, వైరస్ లేదా మనలోని జీవకణాలూ కావచ్చు. అప్పటి వరకూ ఎదురు చూడకుండా ఆత్మావలోకనం చేసుకోవాలి. మనలో విషం పోగు చేసుకుంటున్నామా లేదా దివ్యత్వాన్ని వికసింపజేసుకుంటున్నామా'అనేది ఆలోచించాలి. ఎంపిక మన చేతిలోనే ఉంది. ప్రతి ఒక్కరికీ వారి జీవితాన్ని కొనసాగించడానికి కొన్ని ఎంపికలు ఉంటాయి. జీవితంలో ఎదురుదెబ్బలు తగిలే వరకూ ఎదురుచూడకుండా, అలాంటి పరిస్థితి రాకుండా మనల్ని మనం మలచుకోవడం సరైన ఎంపిక. కృష్ణుడు తనను తాను ఆ విధంగా మలచుకున్నాడు. కృష్ణుడి చేతిలో దెబ్బతినే పరిస్థితికి దారితీసే మార్గాలను నరకాసురుడు ఎంచుకున్నాడు. వారిలో ఒకరిని దేవుడిగా పూజిస్తాం. మరొకరిని రాక్షసుడిగా అసహ్యించుకుంటాం. అందుకే, సరైన మార్గంలో జీవితాన్ని మలచుకోవాలి. లేదంటే జీవితం తనదైన పద్ధతుల్లో మనల్ని మలుస్తుంది. ఈ వాస్తవాన్ని దీపావళి గుర్తు చేస్తుంది. మంచి పుట్టుక కలిగి ఉండి కూడా నరకుడు చెడ్డకు ప్రతినిధిగా మారాడు. మరణించే సమయంలో తన స్థితిని అతను గుర్తించాడు. అది ముందే గుర్తించేవారు మరింత ఉన్నతంగా జీవితాలను మలచుకోగలరు. నిర్దిష్టమైన రీతిలో తనను తాను మలచుకోవడానికి మనిషి ఎంతో శ్రమపడాలి. చాలామంది తమకు నిర్బంధాలైపోయిన విషయాలను జీవితపు చివరి క్షణాల వరకూ గ్రహించరు. ముందే వాటి గురించి తెలుసుకోగలిగితే జీవితాలను మెరుగుపరుచుకోవచ్చు. దానికోసం మనలో చైతన్యాన్ని వెలిగించుకోవాలి. ఈ పండుగ సందర్భంగా కాల్చి బూడిద చేయాల్సింది టపాకాయలను కాదు... మనలోని దోషాలనూ, లోపాలనూ! దీపావళి అందించే సందేశం ఇదే!

కరోనాతో కళతప్పిన పండగలు

దీపాల వెలుగుతో పండగ చేద్దాం

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో పండగలకు కళ తప్పింది. అన్ని పండగల్లాగే దీపావళి కూడా ఇంటికే పరిమితం కానుంది. బాణాసంచా కాల్చితేనే దీపావళి కాదు. అయితే దీపవాళి ప్రత్యేకతే వేరు. దీపాలతో ఇల్లంతా వెలగించి కొత్త కాంతులను ఆహ్వానించడం ద్వారా పండగ జరుపుకోవాలి. అలాగే కరోనా వేళ కలసి పండగ జరుపుకోవాలని, బాణాసంచా కాల్చాలన్న ఆలోచన నుంచి బయటకు రావాలి. కరోనా వ్యాక్సిన్ రావడానికి మరో నాలుగైదు నెలలు పట్టనుంది. ఇప్పటికే ప్రయోగదశలు విజయవంతం అవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా చాలదేశాలు కరోనా వ్యాక్సిన్ తయారీలో శ్రమిస్తున్నాయి. ఈదశలో మరోమారు కరోనా హెచ్చరికలు పాటిస్తూ దీపావళి రోజు దీపాలు వెలిగించి, లక్ష్మీపూజలతో, ఇంటి పిండివంటలకే ప్రాధాన్యం ఇస్తూ పండగ జరుపుకోవడం ఉత్తమం. ఏటా దీపావళి పర్వదినాన్ని పిల్లాపెద్దలు కసలి ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చెడుపై మంచి గెలుపునకు చిహ్నంగా దీపాల పండుగను జరుపుకొంటారు. దీపాల పండుగ వేడుకలకు ప్రజలు ముందుగానే దీపాలు వెలిగించేందుకు సిద్ధం కావడం ఈ యేడాది విశేషంగా చెప్పుకోవాలి. తగంలో ఎప్పుడూ లేనంతగా ఇప్పుడు ప్రజలు దీపాలను వెలిగించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ మేరకు మహిళలు ప్రమిదలను కొనుగోలు చేస్తున్నారు. కాగా కరోనా వైరస్ నేపథ్యంలో కాలుష్యం పెరిగితే కొవిడ్ విజృంభిస్తుందనే ప్రచారం నేపథ్యంలో ప్రజలు గ్రీన్ దీపావళి జరుపుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. పటాసులు కొనుగోలు చేయకుండా మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించి ఆనందాన్ని అందరితో పంచుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. కరోనా దెబ్బంతో వెలుగుల పండుగ దీపావళి కళతప్పుతోందన్న భావన రాకుండా దీపాలను వెలగించి పూజలలో భక్తిప్రపత్తులు చాటడం ముఖ్యం. అయితే తారాజువ్వల వెలుగులు, టపాసుల మోతలతో సందడిగా సాగాల్సిన పండుగ రోజు ఈసారి నిశబ్దంగా గడిచిపోనుందన్న భావన పిల్లల్లో ఉండడం సహజం. కరోనా వ్యాప్తి నేపథ్యంలో బాణాసంచా విక్రయాలు, వినియోగంపై హైకోర్టు నిషేదం విధించడంతో పిల్లలకు పండుగ సందడి కనుమరుగైంది. ఏటా పండుగకు వారం ముందునుంచే బాణాసంచా విక్రయాలతో సందడి ప్రారంభమవుతుంది. కానీ ఈ సంవత్సరం టపాసుల దుకాణాలపై నిషేధంతో అంతటా స్తబ్దత నెలకొంది. కోవిడ్ 19 నేపథ్యంలో దీపావళి టపాసులను అమ్మవద్దని, హైకోర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో దీపావళి టపాసులు విక్రయించే దుకాణాలకు అధికారులు అనుమతి నిరాకరించారు. దీంతో బాణాసంచా కోసం అడ్వాన్సులు చెల్లించిన వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే లైసెన్సుకోసం పోలీసుశాఖకు అగ్నిమాపకశాఖకు చలానాలు చెల్లించారు. అంతేకాకుండా సరుకు దిగుమతి కోసం గోదాముల యజమానులకు డబ్బు చెల్లించినట్టు వ్యాపారులు వాపోతున్నారు. దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు సన్నద్ధమవ్వగా చివరి నిమిషంలో అనుమతి నిరాకరణతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. దుకాణాలకు అనుమతి ప్రక్రియలో భాగంగా ఒక్కో దుకాణదారుడు రూ.30వేల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. ఇక ఒక్కో దుకారణదారుడు సుమారు లక్ష నుంచి రూ.5లక్షల వరకు బాణసంచా కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం దుకాణాలకు అనుమతి నిరాకణతో ఈ పెట్టుబడంతా తమకు తీవ్ర నష్టంగా మారనుందని వ్యాపారులు వాపోతున్నారు. టపాసుల విక్రయాలు, నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించడంతో బాణాసంచా దుకాణదారులు లబోదిబోమంటున్నారు. అన్ని అనుమతులు వచ్చి ఆఖరి నిమిషంలో హైకోర్టు తీర్పుతో విక్రయాలకు బ్రేక్ పడడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోనున్నారు.

బంగారం ధరలకు తోడు కరోనా ఎఫెక్ట్

ధంతేరాస్‌కు కలసిరాని కాలం

రానున్న పెళ్లిళ్ల సీజన్ కోసం వ్యాపారుల చూపు

ముంబై,నవంబర్13(ఆర్ఎన్ఎ): కరోనా తరువాత దేశంలో బంగారం కొనుగోలు పెరిగింది. పెళ్లిళ్ల సీజన్ కావడం, ధనత్రయోదశి పండగలు బంగారం కొనుగోళ్లు పెరిగాయి. దీంతో మెల్లగా మళ్లీ ధరలు పెరుగు తున్నాయి. బంగారం ధరలు స్థిరంగా ఉండడం లేదు. 50వేల మార్కును దాటిన తరవాత కిందికి దిగి రావడం లేదు. రాకుండా వ్యాపారులు కూడా తమవంతు యత్నాలు చేస్తున్నారు. మరోవైపు బంగారం ధర స్థిరంగా ఉన్నప్పటికీ, అటు వెండి ధరలు మాత్రం పెరిగాయి. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.47,200 గా ఉండగా, 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.51,490 గా ఉన్నది. ఇక కిలో వెండి ధర రూ. 500 పెరిగి రూ.63,300కి చేరింది. పరిశ్రమల యూనిట్లు, నాణెపు తయారీ పరిశ్రమల నుంచి డిమాండ్ పెరగడంతో వెండి ధర పెరిగింది. కరోనాతరవాత పుత్తడి ధరలు పెరగడంతో గత సంవత్సరంతో పోలిస్తే అమ్మకాలు కనీసం 30 నుంచి 50 శాతం తగ్గుతాయని మార్కెట్ వర్గాల అంచనా. అయితే దీపావళి, ధంతేరస్ పర్వదినాల సందర్భంగా కొనుగోళ్లు పుంజుకుంటాయని ఆభరణాల పరిశ్రమ ఆశిస్తోంది. రికార్డు స్థాయిలో ఎగిసిన పుత్తడి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో కస్టమర్ల తాకిడి ఆశాజనకంగా వుంటుందని భావిస్తున్నారు. చైనా, అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం తగ్గుముఖం పట్టి చర్చలు ప్రారంభించడం డాలర్‌కు బలాన్నిచ్చింది. దేశీయంగా రిటైల్ మార్కెట్లో కూడా బంగారం పెరుగుతోంది. దీంతో ధంతేరస్‌కు పసిడి లాభాల సిరులు కురిపిస్తుందనే అంచనాల్లో ఉన్నారు. దీపావళి అంటే దివ్వెలు, వెలుగుల సంబరం మాత్రమేకాదు. పసిడి కాంతుల కళకళలు కూడా. దసరా, దీపావళి పండుగ సీజన్ వచ్చిందంటే నగల వ్యాపారులకు బోలెడన్ని ఆశలు. లక్ష్మిదేవిని పూజించడం ఎంత ముఖ్యంగా భావిస్తారో... దీంతో పాటు బంగారం గానీ, ఏదో ఒక కొత్త వస్తువు కొనడం కూడా అంతే ఆనవాయితీ వస్తున్న క్రమంలో వారికి భారీ అంచనాలే ఉన్నాయి. అయితే ఇటీవల రికార్డు స్థాయికి చేరిన పసిడి దరలు దీపావళి నాటికి దిగి వస్తాయా అని కొనుగోలుదారులు ఆశగా ఎదురుచూస్తోంటే.. కొనుగోళ్లతో తమ షాపులు కళకళ లాడతాయా లేదా అని వ్యాపారులు ఆందోళనపడుతున్నారు. కొనుగోలుదారుల విషయానికి వస్తే.. కొనుగోలుదారులు ఈ ధంతేరస్‌కు ఎంతో కొంత బంగారాన్ని తమ సొంతం చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. అయితే ఆకాశాన్నంటిన ధరలు మరింత దిగిరాకపోతాయా అనే మీమాంసలో చాలా మంది కొనుగోలు దారులున్నారు. దీనికి తోడు స్పాట్ మార్కెట్లో బంగారం ధరలు స్వల్పంగా పెరిగినప్పటికీ భవిష్యత్తులో మాత్రం భారీగా తగ్గే అవకాశం ఉందని బులియన్ మార్కెట్ విశ్లేషకులు అంచనాలు వారి ఊహలకు రెక్కలు తొడుగుతున్నాయి. క్షణ క్షణానికి మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో పుత్తడి ధర ఏ రోజు ఎంత పెరుగుతుందో.. ఎంత తగ్గుతుందో అంచనా వేయడం ఒకింత కష్టంగా మారింది. ఇదిలా ఉంటే అంతర్జాతీయ పరిస్థితులు, గ్లోబల్‌గా ఆర్థిక వ్యవస్థ మందగమనం, ట్రేడ్‌వార్ తదితర కారణాల రీత్యా మొత్తం వ్యాపారం గత సంవత్సరంతో పోలిస్తే తక్కువగా ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. తక్కువ నుండి మధ్య స్థాయి వరకు జరిగే కొనుగోళ్లు తీవ్రంగా ప్రభావితమవుతాయని చెప్పారు. ధరలు పెరిగినా రానున్న పెళ్లిళ్ల సీజన్ కూడా తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇటీవల ప్రకటించిన అధిక బోనస్ కూడా డిమాండ్ పెంచడానికి దోహదపడుతుందని తెలిపారు. దీంతోపాటు తమ దీపావళి స్పెషల్ కలెక్షన్‌కు ఇప్పటికే మంచి స్పందన లభిస్తోందన్నారు.

అన్ని మతాలను ఆదరిస్తున్న సీఎం కేసీఆర్ : మంత్రి కొప్పుల

హైదరాబాద్, నవంబర్ 13: ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలను గౌరవిస్తారని, ప్రజలందరి బాగు కోసం కృషి చేస్తూ ప్రగతిపథంలో నడిపిస్తున్నారని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. క్రిస్మస్ పర్వదినం సమీపిస్తున్నందున ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉత్సవాల నిర్వహణ, గిఫ్ట్ ప్యాక్‌లు పంపిణీ ఏర్పాట్ల గురించి మంత్రి తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష జరిపారు.

ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో 1,518 కోట్ల రూపాయలు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. నగరంలో అధునాతన క్రిస్టియన్ భవనాన్ని నిర్మిస్తుండడాన్ని ప్రస్తావించారు. ఆరేండ్ల నుంచి జరుపుతున్న మాదిరిగానే ఈ ఏడాది కూడా క్రిస్టియన్లలోని 2.40మంది నిరుపేదలకు గిఫ్ట్ ప్యాక్‌లు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఈ గిఫ్ట్ ప్యాక్‌లలో చీరలతో పాటు పంజాబీ డ్రెస్సులు, దుస్తులు ఉంటాయని మంత్రి పేర్కొన్నారు.

హైదరాబాద్ మహానగరంలో వీటిని వచ్చే నెల 12నుంచి 15వ తేదీ వరకు, జిల్లాల్లో 11వ తేదీ నుంచి 15వరకు పంపిణీ జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఏటా ఇచ్చే విందు, జిల్లాల్లో ఏర్పాటు చేసే విందులు కొవిడ్ నిబంధనల కారణంగా ఈసారి నిర్వహించడం లేదని మంత్రి వివరించారు. ఈ సందర్భంగా ఆయన పంపిణీ చేయనున్న చీరెలను పరిశీలించారు.

సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతివెస్లీ, టిస్కో జాయింట్ డైరెక్టర్ యాదగిరి అధికారులు పాల్గొన్నారు.

దీపావళి

రాక్షస గుణములు త్రుంచి
సాత్విక గుణములు పెంచి
"ధర్మం"అందించు ధార్మికకేళి!

సకల సంపదలు కలిగించి
భావదారిద్ర్యం తొలగించి
"అర్థం"అందించు ఆర్థికకేళి!!

అఖిల సౌఖ్యము సాధించి
కామిత వరము ప్రసాదించి
"కామం"కల్గించు మార్మికకేళి!!!

జ్ఞాన సుధలను పంచి
అజ్ఞాన వ్యధలని తెంచి
"మోక్షం" కల్గించు అక్షయకేళి!!!!

ధర్మార్థ కామ మోక్షాల సాధించి
ఆధ్యాత్మిక అంతరంగాన్ని మధించి
అంతరాత్మని చేరు అందాల దీపావళి
అదే.. అదే... మన అద్వైత దీపావళి

-సాకి
9951172002

అనాథ దీపావళి

కాలి కాలి బూడిదైన
కాకరొత్తులను -
తిరిగి తిరిగి పోయిన
భూచక్రాలను -
ఆకాశానికి ఎగిరి కూలబడ్డ
రాకెట్లను -
కాగితాలుగా బద్దలై బావురుమన్న
బాంబులను -
చేతులు కాలుతున్నా
అనాథ బాలల ఒడి జాపుకుని
ఏరుకుంటున్నారు
ఇవి ఆశగా వాళ్ల కలలో రాత్రంతా
భంగం లేకుండా
కాలుతైతిరుగుతై

ఎగురుతై
ధన్ ధన్ మంటూ పేలుతై !
ఆహా !
అనాథ దీపావళి ఎంత వైభవం ?!

- కందాళై రాఘవాచార్య
9908612007

రోడ్డున పడ్డ బాణాసంచా వ్యాపారులు

ఆలస్యంగా హైకోర్టు తీర్పు రావడంతో కోట్లలో నష్టాలు

కరోనా వేళ కాల్చకపోవడమే మంచిదంటున్న వైద్యులు

హైదరాబాద్,నవంబర్13(ఆర్ఎన్ఎ): దీపావళికి రెండు రోజుల ముందు వచ్చిన హైకోర్టు తీర్పుతో తీవ్రంగా నష్టపోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని పటాకుల విక్రేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రజలు కరోనా, లాక్‌డౌన్ వల్ల పటాకులు కొనుగోలు చేయడం లేదు. యేటా మంచి లాభాలు ఉండేవి. వాతావరణం

కాలుష్యం చేయొద్దని నిపుణులు పటాకులు కాల్చద్దని అంటున్నారు. ఇప్పటికే కరోనాతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో వాతావరణం కారణంగా నిషేధం విధించారు. పటాకులు కాల్చడంతో హానికర రసాయనాలు వెలువడుతాయి. దీంతో ఊపిరితిత్తుల ఆరోగ్యం దెబ్బ తింటుంది. హోం ఐసోలేషన్‌లో ఉన్న కొవిడ్ పాజిటివ్ వ్యక్తుల మీద వీటి ప్రభావం మరింతగా ఉంటుంది. వయో వృద్ధులు, చిన్న పిల్లలు, ఇతర వ్యాధులున్న వ్యక్తులు జాగ్రత్తగా ఉండాలి. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) పెరిగి, కాలుష్యం తగ్గాలంటే అధికారులు పటాకుల అమ్మకాలు చేపట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. పటాకులు కాల్చకుండా మన పరిసరాలను మనమే రక్షించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీపావళి అంటే ప్రమిదలు, పిండి వంటకాలు, మిఠాయిలు, బొమ్మల కొలువులు.. ఇవే కాకుండా పటాకులకూ ప్రత్యేక స్థానముంది. వేలు వెచ్చించి నగరవాసులు పటాకులు కొనుగోలు చేస్తారు. మహా నగరంలో దీపావళి వేడుకలు అంబరాన్నం టుతాయి. ఇదంతా దశాబ్దాలుగా కొనసాగుతున్న తంతు. ప్రస్తుతం దీపావళి పండుగకు పటాకుల కొనుగోలుకు చాలా మంది ప్రజలు ఆసక్తి కనబర్చడం లేదు. కొవిడ్‌తో కోల్పోయిన ఉపాధి, మరోవైపు వైరస్ వ్యాప్తితోపాటు వాతావరణ కాలుష్యాన్ని పరిగణలోకి తీసుకుంటున్నారు. తాజాగా గురువారం రాష్ట్ర హైకోర్టు పటాకుల అమ్మకం, కాల్చడంపై నిషేధం విధించింది. దీంతో పటాకులు విక్రయించే చిరు వ్యాపారుల్లో నిరాశ, నిస్పృహలు చోటు చేసుకున్నాయి. మహా నగరంలో 60 లక్షలపైన ఉన్న జనాభాకు అనుగుణంగా పటాకుల దుకాణాలు సైతం పదివేలకు పైగానే ఏర్పడుతాయి. ఒక్కో డివిజన్‌కు 50 నుంచి 70 దుకాణాలు వెలసినా ఎనిమిది వేల నుంచి పదివేల పైనే ఈ తరహా దుకాణాలు ఉంటాయని తెలుస్తుంది. ఈ దుకాణాలు గల్లీకి రెండు నుంచి మూడు చొప్పున ఏర్పాటయ్యాయి. ఒక్కో దుకాణంలో రూ.లక్ష విలువజేసే పటాకుల సరుకు ఉంటుంది. తాత్కాలికంగా వెలిసిన ఈ దుకాణాలన్నింటి లో దాదాపు మూడు నుంచి నాలుగు లక్షల పటాకుల సామగ్రిని చిరు వ్యాపారులు స్టోర్ చేసుకొని పెట్టుకున్నారు. పదివేల పెట్టుబడి పెడితే, 20 వేల వరకు రాబడి వస్తుందనే దృష్టితో చిరు వ్యాపారులు సరుకు కొనుగోలు చేశారు. దీంతో లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి చేసే వ్యాపారంలో ఏ మేరకు లాభాలుంటాయో అర్థం చేసుకోవచ్చు. రెండు మూడు రోజుల్లోనే నగరంలో కొన్ని కోట్ల రూపాయల వ్యాపారం పటాకుల రూపేణా జరుగుతుంది. ఇద్దరి నుంచి నలుగురు వరకు ఒక కూటమిగా ఏర్పడి పటాకుల దుకాణాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకొని, నోయిడా, శివకాశీ నుంచి దీపావళి పటాకుల సామగ్రిని దిగుమతి చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అయితే, ప్రస్తుతం కొవిడ్-19 దృష్ట్యా వాతావరణాన్ని కలుషితం చేయొద్దంటూ అధికార యంత్రాంగం, శాస్త్రవేత్తలు, నిపుణులు, చివరకు హైకోర్టు సైతం తీర్పునిచ్చింది. దీనికి తోడు గత ఏడెనిమిది నెలలుగా కరోనా కారణంగా ఎంతో మంది కొలువులు కోల్పోయారు. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది దీపావళి వేడుకకు దూరంగా ఉంటున్నారు. పండుగను జరుపుకొనే స్థితి లో లేరు. ఈ నేపథ్యంలో పటాకుల వ్యాపారుల్లో నైరా శ్యం చోటు చేసుకుంది. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన దుకాణాలకు కస్టమర్లు రాక వెలవెలబోతున్నాయి.

అంబులెన్స్‌ను ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట,నవంబర్13(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్ మార్కెట్ యార్డులో శుక్రవారం జగదేవ్‌పూర్ మండలానికి ప్రత్యేక 108 అంబులెన్సును కేటాయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే 14 వాహనాలు వివిధ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్నాయని తెలిపారు. జగదేవ్‌పూర్‌లో ఈ రోజు నుంచి ప్రజలకు వైద్య సేవ